# జ్ఞాపకాల పందిరి

బి.నాగిరెడ్డి

# జ్ఞాపకాల పందిరి

బి. నాగిరెడ్డి

విజయా పబ్లికేషన్స్
(విజయా వాహినీ సంస్థ)

# జ్ఞాపకాల పందిరి...

ప్రథమ ముద్రణ : మార్చి 2009

ప్రచురణకర్త : బి.విశ్వనాథ రెడ్డి (విశ్వం)

సంకలనకర్త : వి.వీరభద్రన్

తెలుగుసేత : జి.సి.జీవి

టైప్ సెట్టింగ్ : 'సుప్రియా గ్రాఫిక్స్' శ్రీనివాస్

ముఖచిత్రం : ఈశ్వర్

ముద్రణ : సన్ ప్రింట్‌ప్యాక్ సొల్యూషన్స్ ప్రై లిట్.
15, పాళయక్కారన్ వీధి,
కలైమగళ్ నగర్,
ఈక్కాడుతాంగళ్,
చెన్నై - 600 032.
ఫోన్ : 044-4354 2171
e-mail : sunprintpack@gmail.com

ప్రచురణ : విజయా పబ్లికేషన్స్
15, పాళయక్కారన్ వీధి,
కలైమగళ్ నగర్, ఈక్కాడు తాంగళ్,
చెన్నై - 600 032.
ఫోన్ : 044-2365 2583
e-mail : vijayapublications@gmail.com

copy rights : © (All rights reserved. No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means, electronic, mechanical, photocopying, recording, or otherwise, without the prior written permission of the publisher.)

వెల : రూ. 100/-

# ముందు మాట.....

జీవితమనే నౌకకి దిక్సూచి లాంటిది విజ్ఞుల జీవితం. అటువంటి ఒక మహాశయుని జీవిత దర్పణమే జ్ఞాపకాల పందిరి. యాభై సంవత్సరాలకి పైగా సినిమా అనే అద్భుతమైన కళకి తనని తాను అంకితం చేసుకున్న మహానుభావుడు మా తండ్రి బి. నాగిరెడ్డి తమ జీవనయానం లోని స్మృతులు కొన్నింటిని సింహావలోకనం చేసుకున్నారు. వాటి సంకలనమే ఈ పుస్తకం. అమూల్యమైన అనుభవాలని ఈ గ్రంథంలో పొందుపరిచారు మా నాన్నగారు నాగిరెడ్డి. ఇది చదువుతున్నప్పుడు ఆ మధుర స్మృతులు మనమూ అనుభవిస్తాం.

క్రమశిక్షణతో కూడిన జీవితం, నిరంతర పరిశ్రమ, ఉత్తమ సంస్కారం – ఇవే కళాకారుని కలకాలం నిలబెట్టేవి అన్నది వారి నిశ్చితాభిప్రాయం. తనకి సోదర సమానుడైన చక్రపాణి గురించి “ఆయన నాకు ఫ్రెండ్, ఫిలాసఫర్ అండ్ గైడ్” అని వ్యాఖ్యానిస్తారు నాగిరెడ్డి.

జెమిని స్టూడియో అధిపతి, చిత్ర నిర్మాత ఎస్.ఎస్. వాసన్ గురించి ‘ఆయన నాకు మార్గదర్శి’ అని గర్వంగా చెప్పుకుంటారు. అలనాటి ప్రముఖ నటులూ, ప్రజా నాయకులూ, ఎం.జి.ఆర్., ఎన్.టి.ఆర్.లతో తన అనుభవాలను ఆనందంగా పంచుకుంటున్నారు మనతో.

‘యవ్వన దశలో పుస్తకాలు మార్గదర్శకాలు, వృద్ధాప్యంలో కాలక్షేపాలు’ అంటారు. అయితే ఈ గ్రంథం అటు మార్గదర్శిగానూ, ఇటు కాలక్షేపంగానూ వుండటం విశేషం.

మా తండ్రి నాగిరెడ్డి గారి అనుభవాలని, జ్ఞాపకాలని గతంలో మేము వెలువరించిన తమిళ సినిమా పత్రిక ‘బొమ్మై’లో ఉపసంపాదకుడు వి. వీరభద్రన్ సంకలనపరిచారు. వాటిని ‘జ్ఞాపకాల పందిరి’ పేరిట తెనిగించారు జి.సి. జీవి. వారికి మా ధన్యవాదాలు.

ఈ గ్రంథాన్ని నిరంతరం నా స్మృతులలో మెదిలే మా తండ్రి బి. నాగిరెడ్డి గారికి, దైవసమానురాలైన మా తల్లి శేషమ్మగారికి, నన్ను సన్మార్గంలో నడిపించిన నా పెద్దన్నయ్య బి.ఎల్.ఎన్. ప్రసాద్ గారికి అంకిత పుష్పంగా సమర్పించుకుంటున్నాను.

– విశ్వం

# కర్మయోగి సాన్నిధ్యంలో....

నాగిరెడ్డి గారితో సంకలనకర్త వీరభద్రన్

25.02.2004 సాయంకాలం ఐదు గంటల సమయం. విజయా గార్డెన్స్‌లో శ్రీ బి. నాగిరెడ్డి గారి భౌతిక కాయానికి కార్మికులు, ఆస్పత్రి సిబ్బంది, సామాన్య ప్రజలు, వివిధ రంగాలకు చెందిన ఎందరో ప్రముఖులు బరువెక్కిన హృదయాలతో మౌన అంజలి ఘటిస్తున్నారు.

వాళ్ళలో ఒక పదిహేడేళ్ళ కుర్రాడు పక్కవాళ్ళు ఓదారుస్తున్నప్పటికీ ఏడుస్తూనే ఉన్నాడు. నేను దగ్గరికి వెళ్ళాను. నన్ను చూడగానే ఆ కుర్రాడు కన్నీళ్ళు తుడుచుకుంటూ, "నేను గుర్తున్నానా సార్? ఆరోజు అయ్యగారు చూపిన కనికరం వల్లనే ఈరోజు నేను ప్లస్ టూ చదువుతున్నాను," అంటూ ఒక సంఘటనను గుర్తుచేశాడు...

... దాదాపు పన్నెండేళ్ళ క్రితం విజయా హెల్త్ సెంటర్ దగ్గర భవన నిర్మాణం పనులు జరుగుతున్నాయి. పనులు ఎలా జరుగుతున్నాయో చూడడానికి రోజూ ఉదయం సాయంకాలం అక్కడికి రావడం రెడ్డిగారికి అలవాటు. అలా ఒకనాటి సాయంకాలం అటుకేసి వచ్చినప్పుడు ఒక ఐదేళ్ళ పసివాడు మట్టిలో ఆడుకుంటూ ఆయనకు కనిపించాడు.

"ఎవరా బిడ్డ?" అని అడిగారు రెడ్డిగారు.

"మా బిడ్డేనండి," అన్నాడు పనిచేస్తున్న ఒక తాపీ కార్మికుడు.

"బిడ్డను చూస్తూంటే తెలివైనవాడిలా కనిపిస్తున్నాడు. చదివించలేకపోయావా?" అని అడిగారు రెడ్డిగారు.

"నేనూ, నా భార్యా ఇక్కడే పనిచేస్తున్నాం. ఇద్దరూ కష్టపడితే తప్ప పూట గడవని దుస్థితి మాది. చదివించే శక్తి మాకెక్కడిది బాబూ," అన్నాడా మనిషి దీనంగా.

"బాధపడకు, నీ బిడ్డను చదివించే బాధ్యత నాది. రేపే బడిలో చేర్పించి, వాడి చదువుకయ్యే ఖర్చులు నేను చూసుకుంటాను," అన్నారు రెడ్డిగారు.

చెప్పినట్టు చేసి చూపారాయన!

ఆరోజు మన్నులో ఆడుకుంటూ కనిపించిన ఐదేళ్ళ బిడ్డడే ఈ రోజు నా ఎదుట నిలబడ్డ ఈ ప్లస్‌టూ విద్యార్థి!

ఇది నా కళ్ళారా చూసిన సంఘటన.

మరో కంటికి తెలియకుండా ఆయన అందించిన సహాయాలు ఎన్నో, ఎన్నెన్నో!

ఆయన నిర్మాతగా నిర్మించినవన్నీ వినోదాత్మక కుటుంబ చిత్రాలే. అయినా వాటిలో అంతర్లీనంగా పూలహారంలో దారంలా మన సంప్రదాయ విలువలను తెలియజేసే సందేశాలు ఉండేవి.

ఉదాహరణకు ఆయన చివరి దశలో అనువాదం చేసిన 'వళ్ళి' చిత్రాన్నే తీసుకుందాం. రజనీకాంత్ నిర్మించిన 'వళ్ళి' (విజయ) చిత్రాన్ని రెడ్డిగారికి ప్రత్యేకంగా వేసి చూపించారు. 'వళ్ళి' పాత్రను చూసి ముగ్ధులైన రెడ్డిగారు, "వళ్ళి భారతనారీ లోకానికి ఆదర్శం కావాలి. ప్రతి యువతి 'వళ్ళి'లా సాహసం చూపాలి. అప్పుడే మన దేశంలో స్త్రీలకు అన్యాయం జరగదు," అని ప్రశంసించారు. అంతటితో ఆగకుండా ఆ చిత్రాన్ని ఆంధ్ర ప్రేక్షక లోకానికి అందించాలన్న ఆశయంతో డబ్బింగు హక్కులు తీసుకుని తాజా చిత్రాన్ని నిర్మిస్తున్నంత శ్రద్ధతో పనులు పూర్తిచేశారు. ఆయనలో చివరివరకు ప్రజ్వరిల్లిన ఉత్సాహానికీ, విప్లవస్ఫూర్తికీ అది నిదర్శనం!

'మీండుంసావిత్రి' (నేటి సావిత్రి) కథను రచించిన 'విసు'కే దర్శకత్వ బాధ్యతలు అప్పగించారు.

ఆ తరవాత బుల్లితెరపై "ఎంగవీట్టు పెణ్" (మా ఇంటి అమ్మాయి) జయా టీవీలో 42 వారాలపాటు ధారావాహికంగా ప్రసారమయింది. దాని కథా రచయిత ఆయనే. దాని ప్రసారం పట్ల ఆయన కనబరచిన శ్రద్ధాసక్తులు నన్ను అబ్బురపరచాయి. కంటిచూపు మందగించిన ఎనభై ఎనిమిదేళ్ళ వయసులోనూ ఇంతటి ఉత్సాహమా అని ఆశ్చర్యపోయాను.

ఒకసారి కనుచూపులేని ఒక పట్టభద్ర ఉపాధ్యాయుడు రెడ్డిగారిని చూడడానికి వచ్చి, "మీ సినిమాలు చూసే భాగ్యం నాకెటూ లేదు. అయినా మీ సినిమాల్లోని మాటలు, పాటలు విని ఆనందించాను. అవన్నీ కూడా మనిషికి ఆత్మవిశ్వాసం కలిగించేవిగా ఉన్నాయి. అందుకే మీకు కృతజ్ఞతలు తెలియజేయడానికి వచ్చాను," అన్నాడు.

ఆ మాటలకు పులకించిపోయిన రెడ్డిగారు, అతడి భుజం తట్టి, అతడి చేతిలో ఒక కవరు పెట్టి అతణ్ణి ఇంటి దగ్గర కారులో దించి రమ్మని డ్రైవరును పంపారు. అదీ ఆయన వితరణ! ఇలాంటి సంఘటనలు కోకొల్లలు!!

మామూలు రైతు కుటుంబంలో పుట్టి వ్యాపారదక్షుడిగా, ప్రముఖ నిర్మాతగా, స్టూడియో అధినేతగా, పత్రికాధిపతిగా అసాధారణ వ్యక్తిత్వంతో ఎదిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ బి. నాగిరెడ్డిగారు!

జీవితంలో ఎదురుదెబ్బలు తగిలినా, ఉన్నత శిఖరాలు అధిరోహించినా ఏమాత్రం తొణక్కుండా రెండింటినీ దృఢచిత్తంతో స్వీకరించిన స్థితప్రజ్ఞుడాయన!

ఒక పాత్రికేయుడిగా నేను ఆయనతో గడిపిన క్షణాలు మరుపురానివి; అమూల్యమైనవి. ఆ సమయంలో ఆయన నాతో పంచుకున్న అనుభవాల జ్ఞాపకాలు ఆయన్నొక కర్మయోగిగా నా మనసులో పదిలపరచాయి. ఒక కర్మయోగి సాన్నిధ్యంలో ఉన్న అనుభూతిని నాకు కలిగించాయి!

ప్రపంచంలో ఎందరో పుడతారు; బతుకుతారు; వెళ్ళిపోతారు. అయితే కొందరు మాత్రమే భావితరాలకు స్ఫూర్తిప్రదాతలుగా నిలుస్తారు! ఆ కోవకు చెందిన అరుదైన మానవతామూర్తి రెడ్డిగారు!!

"ఈ ప్రపంచం భగవంతుడి సొంతం. ఇవన్నీ (తన సంస్థలు) ఆయనకు చెందినవే. నేను కేవలం ట్రస్టీని మాత్రమే. అంతే! ఈ జీవితంలో నాకీ అవకాశం కల్పించాడాయన" అనేవారు నాగిరెడ్డి.

"నీ కర్తవ్యం నువ్వు సక్రమంగా నిర్వర్తించు. ఫలితం నాకు వదిలిపెట్టు," అన్న గీతాచార్యుడి వాక్కును త్రికరణ శుద్ధిగా ఆచరించిన కర్మయోగి నాగిరెడ్డి. అందుకే ఆయనా బతికి, పదిమందినీ చక్కగా బతికేలా చేయగలిగారు.

ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునేవరకు ఏదో ఒక పనిలో నిమగ్నుడై ఉండేవారు. ఆయన నిరాడంబరులు; నిత్యకృషీవలురు! వృద్ధాప్యం వల్ల శరీరం కొంచెం సడలినప్పటికీ గుండె దిటవు మాత్రం కడదాకా చెక్కు చెదరలేదు!

పిల్లలను ఉన్నతమైన విలువలు పాటించే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి 'చందమామ'ను అందించారు! మరుపురాని ఉత్తమ చిత్రాలకు విజయా-వాహిని పెట్టింది పేరు!

నాణ్యమైన వైద్యసేవలకు, విజయా హాస్పిటల్స్, హెల్త్ సెంటర్ స్థాపించిన ఆదర్శమూర్తి ఆయన!

ఆ మహనీయుడి మనోభావాలను గుదిగుచ్చి వ్యాస సుమాలుగా అందించే అవకాశం కలిగినందుకు ఆనాడు ఎంతగానో ఆనందించాను!

అవి ఈనాడు 'జ్ఞాపకాల పందిరి'గా మీ కరకమలాలను అలంకరించడం గొప్ప భాగ్యంగా భావిస్తున్నాను!!

– సంకలనకర్త

# విషయసూచిక

1. చిన్న గాంధీ .................... 11
2. తల్లి కాని తల్లి .................... 19
3. నా మొదటి సత్యశోధన .................... 22
4. రోహిణి నుంచి వాహినికి .................... 27
5. ఏ కొమ్మ చూసినా 'సుమంగళే' .................... 31
6. పైరుగాలి .................... 34
7. తీరిన రుణం – తీరని రుణం .................... 37
8. 'బి.ఎన్.కె.' శకం .................... 41
9. 'వాహినీ' శకం .................... 45
10. రంగ రంగ వైభవంగా సంబరాలు .................... 49
11. చక్రపాణి శకం .................... 57
12. 'మార్గదర్శి' ఎస్.ఎస్. వాసన్ .................... 85
13. 'నాన్నగారూ' అని పిలిచే ఎన్.టి.ఆర్ .................... 91
14. ఎం.జి.ఆర్. మెమోరియల్ .................... 95
15. బి. నాగిరెడ్డి అడుగుజాడలు .................... 123

# బి. నాగిరెడ్డి తల్లిదండ్రులు

బొమ్మిరెడ్డి నరసింహా రెడ్డి

ఎరుకలమ్మ

## సోదరులు

బి.ఎన్. రెడ్డి
(అన్న)

బి. కొండారెడ్డి
(తమ్ముడు)

బి. రామలింగారెడ్డి
(తమ్ముడు)

బి. నాగిరెడ్డి



బి. నాగిరెడ్డి - శేషమ్మ



## 1

# చిన్న గాంధీ

ఒక నీటి చుక్క నిప్పులో పడినప్పుడు అంతు లేకుండా ఆవిరైపోతుంది. ఆ నీటి బిందువు తామరాకు మీద పడితే పాదరసం వలె అటూ యిటూ అందంగా కదులుతుంది.

అదే నీటి చుక్క ముత్యపు చిప్పలో పడిందంటే మంచి ముత్యమవుతుంది.

మనిషి జీవితమూ ఇంతే. మనిషి పుట్టుక, పెంపకం, పరిసరాలు – వీటి ప్రభావాన్ననుసరించే జీవితం రూపుదిద్దుకుంటుంది.

నా బతుకు పుస్తకంలో నా నేలతల్లి పరిమళాలు విరజిమ్మే పుటలు ఇవి.

నేను పుట్టింది ఒక చిన్న పల్లెటూళ్ళో. కార్తీకమాసం, సోమవారం 1912 డిసెంబరు ఒకటో తేది రాత్రి. ఆంధ్రరాష్ట్రం కడప జిల్లాలో చుట్టూ కొండలు నడుమ చిత్రానది ప్రవహించే ఒక చిన్నగ్రామం అది. పేరు పొట్టిపాడు. దేశానికి వెన్నెముక లాంటి గ్రామాల్లో అదీ ఒకటి.


SRI LAKSHMI
NARASIMHASWAMY
DEVASTANAM
D.N.R

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, పొట్టిపాడు



బి. నాగిరెడ్డిగారు జన్మించిన ఇల్లు - పొట్టిపాడు

మా పూర్వీకులది కర్నూలు దగ్గర 'బొమ్మిరెడ్డి పల్లె' అనే గ్రామం. కొన్నేళ్లకు వారంతా పొట్టిపాడు గ్రామానికి వచ్చారు. కులదైవాన్ని విస్మరించరాదు కదా. మా కులదైవమైన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి చిన్న విగ్రహాన్ని తమతోబాటు తీసుకుని వచ్చి పొట్టిపాడు గ్రామంలో ప్రతిష్ఠించారు. ఆతర్వాత కొంతకాలానికి 'ఎడ్లవారి కొత్తపల్లి' అనే వూరికి వలసపోయి అక్కడ స్థిరపడ్డారని మా నాన్న చెప్పేవారు.

ఆరోజుల్లో పొట్టిపాడు ఒక అందమైన పల్లెటూరు. ఆ వూరికొక పెద్ద. ఆయన పట్ల అంతులేని ప్రేమ, గౌరవం కలిగి వుండేవారు ఊరి జనం. ఆయన మాట ప్రకారం నడుచుకునేవారు. ఆయనకూ గ్రామస్థులంటే ఎంతో అభిమానం. గాంధీజీ ఆశయాలని అనుసరించి నడుచుకునేవారు ఆ గ్రామ పెద్ద. స్వాతంత్ర్యమే తారకమంత్రం. నా చిన్నప్పుడు ఆడుతూ పాడుతూ తిరిగిన ఆ గ్రామాన్ని నేనింకా మరువలేకుండా వున్నాను. ఆరోజుల్లో మన దేశంలోని గ్రామాలన్నీ యిలాగే వుండేవి. అలాంటి ఒక అందమైన గ్రామంలో జీవించాను కొన్నాళ్ళు. గ్రామీణుల్లో ఎంతో ఐకమత్యం. మా వీధి ఎంత చక్కగా వుండేదో! మా జీవితం ఎంతో క్రమశిక్షణతో కూడుకున్నది అంటే ఈరోజు ఎవరూ నమ్మకపోవచ్చు.

ఆరోజుల్లో ఎవరైనా తాగి వూళ్ళోకి వచ్చారంటే వూళ్ళోవాళ్ళే ఆ మనిషిని తన్ని తగలేసేవాళ్ళు. ఇప్పటివలె మా కాలంలో విదేశీ మద్యం వుండేది కాదు. కల్లు అంగళ్ళు మాత్రమే. అవి కూడా ఊరికి చాలా దూరంగా వుండేవి. ఎవరయినా తాగినా ఊళ్లోకి వచ్చేలోపు అతనికి మత్తు దిగిపోయేది. ఇప్పట్లో మాదిరిగా రాత్రింబవళ్ళు తాగి తూలడం అనేది ఆ రోజుల్లో లేదు.

అప్పట్లో నాన్న మద్రాసులో కమీషన్ వ్యాపారం చేస్తుండేవారు. అందువలన నేను మా తాతగారైన పెద్ద హనుమన్న, అమ్మమ్మల దగ్గరే పెరిగాను.

రోజూ సాయంత్రంపూట మా యింట రామాయణం, మహాభారతం, భాగవతం చదవటం అలవాటు. భాగవతం పద్యాల రూపంలో పఠించే సదవకాశం నాకు లభించింది. రామరాజు అనే మా గురువు ఆ పద్యాలను విడమరిచి అర్థం చెప్పేవారు. నా భావి జీవితానికి గట్టి పునాదులు వేసింది కూడా ఆయనే.

మా పల్లెటూరి బడిలో రామరాజు అయ్యవారి దగ్గర విద్యార్థిగా వుండటం నా అదృష్టమనే చెప్పాలి. పన్నెండేళ్ళ ప్రాయానికే నా బడి చదువు ముగిసింది. అప్పుడు మా గురువుగారేమన్నారంటే : "ఇక ఈ బళ్ళో నువ్వు నేర్చుకోవాల్సిందేమీ లేదు. రామాయణం, మహాభారతం, భాగవతం కంఠతా పట్టేశావు," అని. అవి నేటికీ నా రక్తంలో జీర్ణించుకుపోయి వున్నాయి.

మా తాతగారు చాలా నిక్కచ్చి మనిషి. తెల్లవారుజాము నాలుగ్గంటలకే నన్ను నిద్ర లేపేవారు. అంత పొద్దునే నిద్రలేచి పశువుల్ని కొట్టం బయట కట్టేసి, కొట్టమంతా శుభ్రం చెయ్యాలి. నాకిష్టమైన రెండు ఎద్దులుండేవి. వాటిని బండికి కట్టి మా తాత వెళ్ళాల్సిన చోటుకి తోలుకొని వెళ్ళేవాణ్ణి. ఆనాటి ఈ అలవాటు చేతనే ఈనాటికీ ఉదయం నాలుగ్గంటలకే నిద్ర లేవగలుగుతున్నాను.

నేనంటే అమ్మకి వల్లమాలిన ప్రేమ. పశువులకి గడ్డి కోయడానికి వెళ్ళేటప్పుడు నన్ను కూడా తీసుకుని వెళ్ళేది. అమ్మ గడ్డి కోస్తూంటే నేను మోపులు కట్టేవాణ్ణి. అమ్మతో పాటు వాటిని మోసుకుని వచ్చేవాణ్ణి. “నువ్వు ఆడపిల్లగా పుట్టి వుండకూడదా’ అనేది అమ్మ. అంత ప్రేమగా వుండేవాళ్ళం, నేనూ అమ్మా.

మా అమ్మ రోజూ భోజనానికి ముందు ఒక ముద్ద అన్నంలో ఒక చుక్క నెయ్యి కలిపి బాగా పిసికి పక్షులకి పెట్టిం తరువాతే తను తినేది. అంతగా ప్రేమించేవాళ్ళం పక్షుల్ని. ఈ సందర్భంలో ఇంకో విషయం చెప్పాలి –

మా పొలంలో పండే జొన్నలు, రాగులు వంటి ధాన్యపు పంటలు కోత కొచ్చాయో లేదో చూసి, కోతకి తయారుగా వున్నట్టయితే వాటిని కోసి కట్టలు కట్టి మాయింటిముందున్న అరుగుల మీద వరుసగా పేర్చి పెట్టేవాళ్ళం. కాకులు, పిచికలు ఆ ధాన్యపు గింజల కోసం ఆ కట్టలమీద వచ్చి వాలేవి. ముక్కులతో గుచ్చి తినే ప్రయత్నంలో ఆ ధాన్యపు కండెలు ఉయ్యాలలూగేవి. అంచేత కొన్ని ధాన్యపుగింజలు మాత్రమే వాటి రెక్కలకి అంటుకునేవి. ఎగిరిపోయి ఆ ధాన్యపు గింజలని విదిల్చుకొని మళ్ళీ ఎగిరొచ్చేవి. ఈవిధంగా ధాన్యపు గింజలన్నీ అయిపోయేదాకా ఈ ఆట సాగేది. అప్పుడు కింద చెదిరి పడిన గింజల్ని తినడానికి మరో పక్షుల గుంపు తయారయ్యేది. మా వూళ్ళో నేను చూసి ఆనందించిన దృశ్యాలలో ఇదొకటి. సామూహికంగా ఆహారాన్ని పంచుకుని తినే ఈ విధానం నన్నెంతగానో ఆకట్టుకుందని చెప్పాలి.

ఒకరోజు మాకు తెలిసినాయన ఒకరు మా యింటికొచ్చి ఈ దృశ్యం చూసి ధాన్యపుగింజల్ని ఏరుకుతినే పక్షుల్ని తరిమి కొట్టబోయారు. అప్పుడు మా అమ్మమ్మ అతణ్ణి వారించి ‘వాటిని తరిమికొట్టొద్దు. అవి మనుషుల్లాంటివి కాదు. కడుపు నిండగానే తృప్తిగా ఎగిరిపోతాయి. పక్షులు తృప్తిపడితే మన గాదెలు నిండుతాయి. మన సంసారాలు కళకళలాడుతాయి” అంది. అంతలా మా కుటుంబ పెద్దలు ప్రకృతిని, పశుపక్ష్యాదులని ప్రేమించేవాళ్ళు.

నా పధ్నాలుగోయేట ఒకసారి నాన్నగారు మావూరొచ్చారు. “నువ్వు ఇకనుంచి మదరాసులో చదువు”, అని తనతో బాటు నన్ను చెన్నపట్ణానికి తీసుకొచ్చారు.

కొండాపురం రైలుస్టేషన్నించి మద్రాసుకి వచ్చే దారంతా చుట్టూ కొండలు, పచ్చని చెట్లూ నిండిన అందమైన ప్రదేశం. అతి చక్కని మా గ్రామం, గలగలపారే సెలయేరు, ఆ అమాయక ప్రజలు, ముఖ్యంగా అమ్మమ్మ, తాతయ్య వీరినంతా వదిలిపోవడం నాకు దుఃఖాన్నే తెప్పించింది. ఇకనించి రోజూ అమ్మమ్మ దగ్గర కూర్చుని కథలు వినే అవకాశం లేదని తలుచుకుంటే ఏడుపొచ్చింది.

సహజంగానే పిల్లలకి రైలు ప్రయాణమంటే ఎంతో సరదా. కాని నాకు మటుకు ఆరోజు ఎంతో విచారంగా అనిపించింది. ఈ తరం మనుషులు వూహించి కూడా చూడలేని మా పల్లెటూరి మధురానుభూతులతో పాటు మనసులోని మూగబాధని కూడా మోసుకుంటూ మద్రాసు వచ్చాను. వచ్చిన వెంటనే నాకు క్రాపు చేయించారు. కాలర్ పెట్టిన చొక్కా తొడిగారు. గోవిందప్ప నాయకన్ వీధిలోని స్కూల్లో చేర్పించారు. ఏడు, ఎనిమిది తరగతులు ముత్యాలపేట స్కూల్లో చదివాను.

అరక్కోణంకు చెందిన నరసింహులు నాయుడు అనే మా ఫామిలీ ఫ్రెండొకాయన వచ్చేవారు. నాకు ఇంగ్లీషు నేర్పిన గురువు ఆయనే. రాత్రి నిద్ర మెలకువ వచ్చినప్పుడు సైతం ఆ ముందురోజు నేను నేర్చుకున్న ఆంగ్లపదం గురించి అడిగేవారు. ఉదయం నాలుగింటికే లేచి వ్యాయామం చేసేవారు ఆయన. స్వామి రామతీర్థ రచనల్ని కథల రూపంలో నాకు పరిచయం చేసింది కూడా ఆ నాయుడు గారే.

మా అన్నయ్య (శ్రీ బి.ఎన్. రెడ్డి) చదువుమీద ఎంతో శ్రద్ధ కనబరిచేవాడు. దేశ స్వాతంత్ర్య పోరాటం పట్ల ఎంతో ఆసక్తి వున్నప్పటికి చదువుమీద ధ్యాస కారణంగా తీవ్రంగా పాల్గొనలేకపోయేవాడు. నాకు మాత్రం స్కూలు చదువుకన్న స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడమే ముఖ్యంగా అనిపించేది.

పదో తరగతికి రాగానే నా జీవితం ఒక ముఖ్యమైన మలుపు తిరిగింది. స్వాతంత్ర్య పోరాటం ముమ్మరంగా సాగుతున్న రోజులవి. అందులో ముఖ్యాంశం విదేశీ వస్తు బహిష్కరణ. దేశ ప్రజలంతా ఒకటై అంగళ్ళ ముందు గుమిగూడి విదేశీ వస్తువులకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అన్నయ్య, నేను ఈ పోరాటంలో పాల్గొనాలని నిర్ణయించుకున్నాము. కాని మా నాన్న ఈ చిన్న వయసులో మీకిది తగదు అని ఖచ్చితంగా చెప్పేశారు.



బి. నాగిరెడ్డి గారు చదివిన ప్రాథమిక పాఠశాల, పొట్టిపాడు



కొత్తపల్లి ఇల్లు

నేను తొమ్మిదో తరగతి నుంచి పదో తరగతిలో చేరిన రోజులు. అప్పుడు సంగు గణేశన్ అనే ఒక కాంగ్రెసువాది 'స్వతంత్ర శంఖారావం' (తమిళం) అనే పత్రిక నడిపేవారు. అది మద్రాసు తిరువళ్ళిక్కేణి నుంచి వెలువడేది. ఆ పత్రికను నగరంలోని వేర్వేరు ప్రాంతాలకి తీసుకెళ్ళి అమ్మే బాధ్యత స్కూలు పిల్లలమైన మాకివ్వబడింది. నాకు మెరీనా బీచ్ ప్రాంతం యిచ్చారు. పత్రికలమ్మడం, ఆ డబ్బులు వసూలు చేసి తెచ్చివ్వడం లాంటి పనులు ఎంతో వుత్సాహంతో, శ్రద్ధతో చేసేవాడిని.

ఆ సమయంలో గాంధీజీ గారి పిలుపునందుకుని దేశప్రజలంతా ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమాల్లోనూ పాల్గొన్నారు. నేను కూడా ఉద్యమంలో పాల్గొనాలని తీర్మానించాను. అప్పటి కాంగ్రెసు నాయకుడైన ప్రకాశం పంతులుగారు నన్ను శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారి దళంలో చేర్పించారు. ఈ విషయం నాన్నగారికి తెలియనివ్వలేదు నేను. కాని ఎలాగో తెలిసిపోయింది. నన్ను పిలిచి అడిగారు.

"మీకు నలుగురు సంతానం. అందులో ఒకరు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటే తప్పేమిటి?" అన్నాను.

"అయితే సరే. ఉద్యమంలో చేరి ఖద్దరు ప్రచారం చెయ్యడానికి గ్రామానికి వెళ్ళు. ఇక్కడ వుండొద్దు," అని అన్నారు.

"సరే", అన్నాను. ఉద్యమంలో పాల్గొనడానికి అన్నయ్య కూడా నాతో వచ్చేసాడు. నాన్నగారిచ్చిన డబ్బుతో మా గ్రామానికి చేరుకున్నాము.

నాన్నగారిచ్చిన డబ్బుతో దూది కొని, బాగా ఏకి చుట్టుప్రక్కల గ్రామాల్లోని నేత నేసేవారికి తూకం వేసి యిచ్చి వచ్చేవాళ్ళం. మా పొరుగు గ్రామంలో ఇరవై ముప్ఫై నేత నేసే కుటుంబాలుండేవి. వాళ్ళకి నూలు సప్లై చేస్తే మాకు కావాల్సిన పంచెలు, తువ్వాళ్ళు, దుప్పట్లు మొదలైనవి నేసిచ్చేవారు. అలా తయారైన ఆ ఖద్దరు బట్టల్ని కాంగ్రెసాఫీసుకి తీసుకెళ్ళి ముద్ర వేయించుకోవాలి. అప్పుడే ఖాదీ వస్త్రాలయంలో అమ్మకానికి తీసుకుంటారు. ఆ వస్త్రాలని మద్రాసు సైదాపేటకి తెచ్చి ముద్ర వేసి విక్రయించుకోవాలి. ఇన్ని యిబ్బందులూ భరించడానికి కారణం మాలోని స్వతంత్ర దాహం, దేశానికి సేవ చెయ్యాలనే ఆకాంక్ష మాత్రమే.

ఈ ఖద్దరు వ్యాపారం మొదలైనప్పట్నించీ రోజూ ఇరవై ముప్ఫై గ్రామాలు తిరిగి రావాల్సి వచ్చేది. రకరకాల వ్యక్తుల్ని కలవడం, వారితో స్వాతంత్ర్య భావాలు పంచుకోవటం, చర్చించటం ఎంతో సరదాగా వుండేది.

ఆరోజుల్లో కాంగ్రెసు వాళ్ళంతా తప్పనిసరిగా ఖద్దరు టోపీ ధరించేవారు. అది లేకుండా ఏ కాంగ్రెసు కార్యకర్తా బయట కనిపించేవాడు కాదు.

నేను కూడా ఖద్దరులోకి మారాను. గాంధీగారి ఆదేశం ప్రకారం ఖద్దరు పైజామా, ఖద్దరు జుబ్బా, గాంధీ టోపి ధరించి చెప్పుల్లేకుండా నడవటం అలవాటు చేసుకున్నాను. కాలక్రమేణా మా ప్రాంతంలో నాకు 'చిన్న గాంధీ' అనేది సార్థక నామధేయమైంది. చుట్టుప్రక్కల గ్రామాల్లో అందరూ నన్ను 'చిన్నగాంధీ' అనే పిలిచేవారు. నా ఈ స్వాతంత్ర్య పిపాస ఫలితం ఏమిటంటే మా నాన్న నా చేతికిచ్చిన పదివేల రొఖ్ఖం ఖాళీ అయిపోవడమే. అయినా కూడా స్వాతంత్ర్య సంగ్రామంలో నేను సైతం ఉడుతా భక్తిగా పాల్గొన్నానని తలుచుకున్నప్పుడు ఈనాటికీ నాకు కలిగే తృప్తి, ఆనందం అనిర్వచనీయమైనవి.

పదివేల రూపాయలు ఖర్చయిపోయి నష్టపోయామని చెప్పినప్పుడు మా నాన్న సంతోషపడ్డారు. ఇసుమంత కూడా విచారించలేదు. కారణం - ఎక్కడ తన యిద్దరు కొడుకులూ తీవ్రమైన రాజకీయాల్లోకి దిగిపోయి, పోరాటాల్లో చిక్కుకుని, జైలుపాలై కుటుంబానికి దూరమై జీవితాన్ని పాడు చేసుకుంటారో అనే చింత ఆయనకుండేది. అంతేకాదు, అప్పుడు జరిగిన మరో సంఘటన కూడా చెప్పుకోవాలి ఈ సందర్భంలో.

మద్యపాన నిషేధ ప్రచారంగా కల్లు అంగళ్ళ ముందు ధర్నా చేస్తున్నాం. గాంధీ గారు చెప్పినట్లు కరపత్రాలు పంచుతున్నాం. అప్పుడు కల్లు తాగేవాళ్ళలో ఒకడు మా కార్యకర్తలలో ఒకర్ని కత్తితో పొడిచి పారిపోయాడు. ఒకటే గొడవ జరిగింది. ఈ సంగతి విన్న మా అవ్వ వెంటనే మా నాన్నకి కబురు చేసింది నన్ను మా అన్నని మద్రాసుకి తీసుకెళ్ళమని, ఇబ్బందుల పాలవుతామేమోనని. అందుచేత మా నాన్న ఆజ్ఞ ప్రకారం నేనూ మా అన్నా మద్రాసుకి తిరిగి వచ్చేశాం.

మా అన్నకి చదువు పట్ల ఎక్కువ శ్రద్ధ వుండటం చేత వారు మాత్రం కాలేజి చదువు కొనసాగించారు. "నువ్వు చదివింది చాలు. బుద్ధిగా ఇకనుంచి మన ఉల్లిపాయల వ్యాపారం చూసుకో", అని వ్యాపారంలోకి దించేశారు నన్ను. నా జీవితంలో ఇది మరో మలుపు.

అప్పుడు నాకు పద్దెనిమిదేళ్ళు. మద్రాసు నుంచి రంగూన్ (బర్మా)కి స్టీమర్‌లో వెళ్ళాను. ఆరోజుల్లో మేము పెద్ద ఎగుమతి వ్యాపారుల్లో లెక్క అంచేత షిప్పులో నా కోసం ప్రత్యేకంగా ఒక గది కేటాయించబడింది. అన్ని ప్రత్యేక సదుపాయాలు మాకు అప్పుడు.

◆



## 2

# తల్లి కాని తల్లి

ఈ రోజుల్లో మనుషుల మధ్య సుహృద్భావం నశించిపోతున్నది. కుల, మత భేద భావనలే ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి.

మా రోజుల్లో పరిస్థితి ఇలా వుండేది కాదు. దేశం కాని దేశంలో వ్యాపార నిమిత్తం నేనొంటరిగా నివసించిన రోజుల్లో నాకొక తల్లి లభించింది.

పదినెలలు మోసి కంటేనే తల్లా? మాతృత్వపు భావనలు మనసులోతుల్లోంచి పెల్లుబుకుతాయి. తన ప్రేమతో, అనురాగంతో నన్ను ముంచెత్తిన ఆ తల్లి ఆప్యాయతని తలుచుకుంటే ఇప్పుడు కూడా నా మనసు పులకించిపోతుంది. తల్లి కాని మహాతల్లి ఆవిడ నాకు.

వ్యాపార నిమిత్తం నేను రంగూన్‌కు ప్రయాణమవుతున్నప్పుడు నాన్నగారు చెప్పారు, "రంగూన్ చేరిన వెంటనే ఇస్మాయిల్ మొహమ్మద్ బోడిని కలుపు. ఆయనకి వినయపూర్వకంగా ప్రణామం చేసి మన వ్యాపారం మొదలుపెట్టు."

ఎవరీ ఇస్మాయిల్ మొహమ్మద్ బోడి?

రంగూన్‌లో ఈయనొక పెద్ద వ్యాపారి. వయసు అరవైకి పైనే. ఒకసారి మద్రాసు చిన్నతంబి వీధిలో మిరపకాయలు టోకున కొనుగోలు చేశారు, రంగూన్‌కు తీసుకువెళ్ళడానికి. కాని ఆ సమయంలో ఆయన దగ్గర చాలినంత పైకం లేదు. "మాకు తెలిసినవాళ్ళెవరైనా గ్యారంటీ యిస్తే మిరపకాయల బస్తాలిస్తాము మీకు" అని చెప్పారు మిరపకాయల గిడ్డంగి యజమానులు. ఇస్మాయిల్ మా నాన్నని సంప్రదించాడు. వెంటనే నాన్న గ్యారంటీ యిచ్చారు. అలా అల్లుకుంది నాన్న – ఇస్మాయిల్ మైత్రి. ఈ కారణంగానే రంగూన్ వచ్చినప్పుడు నన్ను తమ యింట బస చేయవలసిందిగా కోరారు ఇస్మాయిల్.

రంగూన్‌కి చేరిన వెంటనే నాన్న మాట ప్రకారం ఎడ్వర్టు వీధిలోని ఇస్మాయిల్ ఇంట బస చేశాను. ఇస్మాయిల్‌గారి సతీమణి నన్ను కన్న కొడుకు వలె ఆదరించింది. నాకు అది పరాయి యిల్లు అనిపించలేదు. నాకు కొంచెం కొంచెం ఉర్దూ నేర్పించే వారు ఇస్మాయిల్. నాకు రాత్రుళ్ళు చదివే అలవాటు.

అలా నేను రాత్రిపూట చదువుతుంటే ఓర్వలేక దీపం ఆర్పేసేవాళ్ళు ఇస్మాయిల్ కొడుకులు. అది గమనించి వాళ్ళమీద కోప్పడేది ఆ అమ్మ. తమ తల్లి నామీద కనబరిచే ఆపేక్ష చూసి ఇస్మాయిల్ కొడుకులకి అసూయ కలిగేది. నా దగ్గర కూర్చుని



రంగూన్ హార్బర్ (ఆరోజుల్లో)

స్వయంగా వడ్డించేది ఆ తల్లి. నాకోసం ఆ యమ్మ చేసిన త్యాగం గురించి కూడా యిక్కడ చెప్పుకోవాలి.

నేను రంగూన్‌లో వుండగా రంజాన్ పండుగ వచ్చింది.

ఆ వ్రతం పాటించేవారంతా తప్పనిసరిగా సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తరువాత మాత్రమే భోంచేయాలి. ఈ మధ్యలో ఎంగిలి కూడా గుటకేయకూడదు. కాని ఆయమ్మ ప్రత్యేకంగా నాకోసమని ప్రొద్దున్నే రకరకాల వంటలు తయారుచేసి పెట్టేది. “ఎందుకమ్మా శ్రమ? నేను బయట మొగల్ వీధిలో వుండే చెట్టినాడు మెస్సులో భోంచెయ్యనా”, అన్నా వినేది కాదావిడ. ఆ తల్లి చేతి వంట రుచి మాటల్లో వర్ణించలేం. ఫలితంగా రంజాన్ నెలాఖరుకి నాలుగు పౌనుల బరువు పెరిగింది నా శరీరం.

ఆ తల్లి నా మీద చూపిన ఆదరాభిమానాలు ఎన్నటికీ మరువలేని మధురానుభూతులు.

◆

## 3

# నా మొదటి సత్యశోధన

ఎక్కడైతే స్త్రీలు పూజింపబడతారో
అక్కడ దేవతలు నివాసముంటారు
అనేది ఆర్యోక్తి.

నేను రంగూన్‌లో ఉల్లిపాయల వర్తకం చేస్తున్న రోజులవి. షిప్పులో సరుకు దిగే సమయంలో మాకు పని ఎక్కువగా ఉండేది. మిగతా సమయాల్లో పైకం వసూలు చేసి నాన్నగారికి పంపించడం, బాగా డ్రెస్ చేసుకుని రంగూన్ నగరమంతా తిరిగి చూట్టం ఇదే నా పని. ఇలా ఏడాది గడిచింది. ఇస్మాయిల్ బోడి ఇంటినుంచి నా మకాం మారింది. పెద్ద బజారు వీధి మేడమీదికి మారాను. పక్కనే నా భోజనాల గది కూడా ఏర్పాటైంది. వీటితో పాటు నాకొక కారు కూడా యిచ్చారు.

ఒకరోజు... భోంచేసి బయటకు వస్తున్నాను. ఎన్నో రోజులుగా పస్తులుండి వాడిన ముఖం, మాసి దుమ్ము కొట్టుకుంటున్న బట్టలు, కాంతి విహీనమైన చూపులతో

అందరిని యాచిస్తూ, నిలబడిన ఆ వ్యక్తి కనిపించాడు. "భోంచేసి మూడు రోజులైందయ్యా! ఏదయినా సాయం చెయ్యండి బాబూ", అన్నాడు హీనస్వరంతో. ఎంతో జాలివేసింది నాకు.

"డబ్బివ్వలేను. కావాలంటే ఈపూట తృప్తిగా భోంచేసి వెళ్ళు", అని భోజనశాలలోకి తీసుకుని వెళ్లాను.

అతని కిష్టమైన భోజనం తెప్పించి తృప్తిగా తినమన్నాను. నావైపోసారి కృతజ్ఞతా భావంతో చూసి ఆవురావురుమని తినసాగాడు. భోజనం ముగించినా అతని ముఖంలో ఏదో అసంతృప్తి. ఏదో చెప్పడానికి తటపటాయిస్తున్నాడని అర్థమైంది. సంకోచిస్తూనే ఇలా చెప్పసాగాడు : "ఇక్కడ నేను కడుపారా భోం చేసాను. అక్కడ మా యింట్లో నా భార్యా కూతురు పస్తున్నారే", అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. "సరే, నాతోరా", అని అతణ్ణి ఒక కిరాణా కొట్టుకి తీసుకెళ్ళి ఒక నెలకి సరిపడా ముగ్గురు మనుషులకి అవసరమయ్యే వంట సామగ్రి కొని అతని చేతికిచ్చి "తీసుకుని వెళ్ళు", అన్నాను.

**రంగూన్ పెద్దబజారు (ఆరోజుల్లో)**

అతను పులకించిపోతూ “అయ్యా! నాకింత ఉపకారం చేసిన మీరు ఒక్కసారి మా యింటిని పావనం చెయ్యండి”, అని వేడుకున్నాడు. కాదనలేకపోయాను.

“సరే, పద”, అని వంట సామానులని, అతడిని కారులో ఎక్కించుకుని బయలుదేరాను. ఒక ఫర్లాంగు దాటేక వరుసగా వున్న పూరిగుడిసెల్ని చూపించి, “అక్కడే మా యిల్లు”, అని చెప్పాడు. రోడ్డు మీద కారాపాను. సామాన్లు కిందికి దింపి ఇంట్లోపలికి తీసుకువెళ్ళాడు. నన్నూ లోపలికి రమ్మని ఆహ్వానించాడు. తిరస్కరించలేక లోపలికి నడిచాను.

ఒక గది, వంట గది మాత్రమే వున్న గుడిసె అది. ఆ ప్రాంతమంతా అటువంటి పూరిళ్ళే! ఏ వసతులూ లేని ఇల్లు అది. నేను నిలుచునే వున్నాను. నన్ను కూర్చోమన్నాడు. “ఫరవాలేదు వెళతాను”, అన్నాను.

“అలాక్కాదు, ఇంతదూరం వచ్చారు. టీ అయినా తాగి వెళ్ళండి”, అని బతిమాలుకున్నాడు. కాదనలేకపోయాను. వంట గదిలోకి వెళ్ళి భార్యా కూతుళ్ళతో గొంతు తగ్గించి ఏదో అంటున్నాడు. ఏదో వాదించుకుంటున్నారు. వంట గదిలోంచి నేనున్న గదిలోకొచ్చి ధడాల్మని ఆ వాకిలి తలుపు మూసి గడియపెట్టాడు. నేను గతుక్కుమన్నాను. ఒకవేళ నామీద దౌర్జన్యం జరిపి డబ్బు లాక్కోవాలనుకుంటున్నాడా అని భయమేసింది. అప్పుడు నాదగ్గర డబ్బు కూడా ఎక్కువగానే వుంది. కానీ ఏం జరుగుతుందో చూద్దాం అని మనసు దిటవు చేసుకున్నాను.

వాళ్ళమధ్య వాదన పెరిగింది. కూతుర్ని నాలుగు తన్ని నాదగ్గరికి తెచ్చి తోశాడు. నా కాళ్ళమీద పడిన ఆ అమ్మాయి బెదిరిపోయి పైకి లేచింది. “మీ నాయనతో ఏమిటి గొడవ?”, అని తరచి తరచి అడిగిన మీదట ఇలా చెప్పింది. “మీరు మాకు చేసిన సహాయానికి ప్రత్యుపకారంగా నేను మిమ్మల్ని సంతోషపెట్టాలట. బలవంతం చేస్తున్నాడు”, అని ఇంకా చెప్పింది : “నేను మనస్ఫూర్తిగా ఒకతన్ని ప్రేమిస్తున్నాను. ఈ ప్రాంతంలోనే ఒక అంగట్లో పనిచేస్తున్నాడు. అతన్ని పెళ్ళాడాలంటే అతని తలిదండ్రులకి మేము ఐదు వందల రూపాయలు సమర్పించుకోవాలి. ఆ స్తోమత లేదు మాకు. మిమ్మల్ని నేను సంతోషపరచి ఆ డబ్బులు సంపాయించుకోమంటున్నాడు నాయన”, అని భోరున విలపించింది.

ఆమె నిజాయితీని మెచ్చుకున్నాను. ఆమె తండ్రిని పిలవమన్నాను. అవమాన భారంతో కుంచించుకుపోయి నాముందు నిలబడ్డాడు. నేను ఆ అమ్మాయి చేతిలో

అయిదు వందలు పెట్టి "ఈ డబ్బు వరుని తల్లిదండ్రులకిచ్చి నువ్వు మనసిచ్చిన ఆ అబ్బాయిని వివాహమాడు", అని పైకం యిచ్చేసి అక్కణ్ణించి వచ్చేసాను.

ఇది జరిగినప్పుడు నాకు పందొమ్మిదేళ్ళు. అప్పటిదాకా నేను గిరి గీసుకున్నదే ప్రపంచం అనుకునేవాణ్ణి. ఈ సంఘటన నాకో కొత్త ప్రపంచాన్ని చూపించింది. మనుషులు ఇలా కూడా వుంటారా అని ఆశ్చర్యపోయాను.

ఇదంతా ఇప్పుడెందుకు చెప్పాల్సి వచ్చింది?

అరవై అయిదేళ్ళ క్రితం నాకెదురైన అగ్నిపరీక్షకి నేనెలా తట్టుకుని బైటపడ్డాను అన్నది చెప్పడానికే. ప్రలోభాలకి సులభంగా లొంగిపోయే ఆ వయసులో నాలో అంతటి మనోనిబ్బరం ఏర్పడడానికి కారణం - నేను చిన్నప్పుడు వంటబట్టించుకున్న మన పురాణాల ప్రభావమే. ఏదైనా చిక్కు సమస్య నాకెదురైనప్పుడు పరిష్కారం కూడా ఆ భగవంతుడే చూపిస్తూ వచ్చాడు. ఇది నాకు భగవంతుడిచ్చిన వరప్రసాదంగానే భావిస్తున్నాను.

ఆరోజు ఆ అమ్మాయి జీవితాన్ని పేదరికం కాటేయబోయింది. ఆమెకి సాయం చెయ్యగల సహృదయము, సంపద ఆ భగవంతుడు నాకిచ్చాడు. మానవత్వంతో ఒక స్త్రీ జీవితాన్ని ఆదుకున్నాననే తృప్తి గుండెల నిండా నిండింది. శోకం నిండిన ఆమె ముఖంలో చిరునవ్వుని చూడగలిగాను. అంతులేని ఆనందంతో తిరిగొచ్చాను. భగవంతుడు నాకు ఆనాడు ఆ శక్తి యిచ్చినందుకు ఈనాడు అతనికి ప్రణమిల్లుతున్నాను.

తరువాత మన దేశానికి తిరిగి వచ్చాను. మళ్ళీ బర్మాకి వెళ్ళలేదు. కాని ఆ అమ్మాయి నన్ను మనసారా దీవించే వుంటుంది. ఆవిడ వంటి వ్యక్తుల దీవెనలే నన్నింతటి వాణ్ణిగా ఎదిగేలా చేశాయని దృఢంగా నమ్ముతున్నాను.

మరో సంగతి కూడా చెప్పాలని వుంది.

స్త్రీని గౌరవించేవారికెప్పుడూ మంచి భవిష్యత్తు వుంటుంది. చిన్నప్పుడు రామాయణం, మహాభారతం, భాగవతం, అమ్మమ్మ చెప్పిన కథలు నాకు నేర్పిన పాఠం యిది.

రంగూన్ నించి మన దేశం బయలుదేరేముందు విషజ్వరానికి గురై చాలా అవస్థపడ్డాను. ఆరోగ్యం కొంచెం కుదుటపడ్డాక నన్ను చెన్నైకి తిరిగి పంపించారు.

శరీరం చిక్కిపోయి, మొహం నల్లబడి మావాళ్ళే నన్ను గుర్తుపట్టలేని ఆకారంతో ఇంటికి తిరిగొచ్చాను. అయినా అటు మా అమ్మవైపు ఇటు మా తండ్రివైపు వుండే చుట్టాల నుంచి నాకు పిల్లనివ్వడానికి పోటీలు పడ్డారు. విదేశానికి వెళ్ళి నేను వ్యాపారం చేసి రావడమే అందుక్కారణం.

కాని –

బంధువుల మనసు నొప్పించరాదు. అదీగాక దగ్గరి బంధువుల్లో సంబంధం చేసుకోవడం నాకిష్టం లేదు. మాకు దూరపు బంధువౌకాయన నెల్లూరులో ప్రభుత్వోద్యోగిగా వుండేవారు. ఆయనగారి సతీమణి ఒక సంబంధం ఖాయం చేసింది. ఆరోగ్యం కోలుకున్నాక 4.12.1933న నా వివాహం జరిగింది. అప్పుడు నాకు 21 సంవత్సరాలు, నా భార్య పేరు శేషమ్మ. పెళ్ళి నెల్లూరులో వైభవంగా జరిగింది.

ఒక స్త్రీ తన మెట్టినింటికి శోభను, గౌరవాన్ని తెస్తుందని అనుభవపూర్వకంగా తెలుసుకోగలిగాను.

◆



## 4

# రోహిణి నుంచి వాహినికి

తరుగుతూ పోతే చివరికి తరిగిన వాళ్ళనే ఏడ్పించే ఉత్తమురాలు ఉల్లిపాయ. ఉల్లిపాయల వ్యాపారంలో దెబ్బతినకుండా పైకి రావడం అందరికీ సాధ్యం కాదంటారందుకే.

మా అన్నగారైన శ్రీ బి.ఎన్. రెడ్డి జి.డి.ఎ. చదువు పూర్తిచేసి (ఈనాటి ఛార్టెడ్ ఎకౌంటెన్సీతో పోల్చవచ్చు) చెన్నైలోని ఒక సంస్థలో ఉద్యోగంలో చేరాడు. ఆయనకి మా నాన్నగారి ఉల్లిపాయల వ్యాపారం ఎందుకో నచ్చలేదు. తరచుగా మా అన్న చెన్నపురి ఆంధ్ర మహాసభకి వెళుతుండేవారు. అక్కడ జరిగే సాహితీ సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రముఖ పాత్ర వహించేవారు. బళ్ళారి రాఘవాచారి, స్థానం నరసింహారావు, వేమూరి గగ్గయ్య లాంటి హేమాహేమీలైన రంగస్థల నటులంతా ఆనాడు చెన్నపురి ఆంధ్రమహాసభలో సభ్యులుగా వుండేవారు. ఈ కల్చరల్ ప్రోగ్రాముల్లో పాల్గొని ఇంటికి బాగా ఆలస్యంగా వచ్చేవారు అన్నయ్య. నాన్నకి చాలా కోపం వచ్చేది. నాన్నగారు వ్యాపారబాధ్యతల్ని అన్నయ్యకి అప్పగించడానికి బదులు చిన్నవాడినైన


Kannamba in
GRIHALAKSHMI
RAMANUJACHARI, KANCHANAMALA and NAGIAH.
Director
H.M.REDDY

గృహలక్ష్మి 1938

వందేమాతరం 1939

నాకు అప్పగించారు. అయినా అన్నయ్యకి నామీద ఎటువంటి అసూయగాని, కోపంగాని కలుగలేదు. తన కళాభిరుచికి అడ్డు తగలడంలేదని సంతోషం ఆయనకి.

ఒకరోజు తాను చలనచిత్ర రంగంలో అడుగిడబోతున్నట్టు ప్రకటించారు అన్నయ్య. అప్పుడు కొల్హాపూరు నుంచి ప్రముఖ సినీ దర్శకులైన హెచ్.ఎం.రెడ్డి వచ్చివున్నారు. ఆయనతో కలిసి "రోహిణి పిక్చర్స్" అనే చలనచిత్ర సంస్థని స్థాపించారు అన్నయ్య.

పెట్టుబడి నిమిత్తం పాతికవేల రూపాయలడిగారు నాన్నని. ఆరోజుల్లో అది చాలా పెద్ద మొత్తం. నాన్న సంకోచించాడు. "అన్నయ్య ఏమీ తెలియని వాడేం కాదు. ఆయనిష్ట ప్రకారం సినిమానిర్మాణం చేపట్టడంలో తప్పేమిటి?" అని అన్నకి వత్తాసు పలికాను.

"సరే, డబ్బు సర్దుతాను", అన్నాడు నాన్న.

రోహిణి పిక్చర్సు నిర్మించిన మొదటి చిత్రం 'గృహలక్ష్మి' (1938) విజయవంతమైంది. ఆ తరువాత హెచ్.ఎం. రెడ్డికి మా అన్నకి మధ్య తలెత్తిన అభిప్రాయ భేదాల కారణంగా రోహిణి సంస్థ నుంచి బైటికి వచ్చేశారు అన్న. ఆడిట్ వుద్యోగానికే తిరిగి వెళ్ళాలనే ఆలోచనలో వుండగా ఆయన సన్నిహిత మిత్రులైన బ్రిజ్‌మోహన్‌దాస్, మూలా నారాయణస్వామి, ఆ నాటి ప్రముఖ హీరో చిత్తూరు నాగయ్య, వీరితో నేనూ కలిసి ఆయన్ని చిత్ర నిర్మాణంలో కొనసాగడానికి ఒప్పించగలిగాము. అందరం చెన్నై ఎలియట్స్ బీచ్ సముద్ర తీరంలో కూర్చుని "సమాజానికి మంచి సందేశాన్నందించగల ఉత్తమ చిత్రాలని అందించగలమని మనం నిరూపించాలి. ఇదొక ఛాలెంజిగా తీసుకోవాలి. ఇందుకోసం మీరు చిత్ర నిర్మాణంలో కొనసాగాల్సిందే", అని అన్నయ్యని సమ్మతింపజేశాము.

రామాయణం చదివి చదివి అన్నయ్య రామునివలెనే అనిపించసాగారు నాకు. కాని నేనాయనకి లక్ష్మణుడిలా వున్నానా అంటే... భరతుని వలె వున్నానని మాత్రం చెప్పగలను.

రోహిణీ నుంచి 'వాహిని' అవతరించింది. దక్షిణ భారత సినిమా చరిత్రలో 'వాహిని' శకం ప్రారంభమైంది. మొదటి చిత్రం 'వందేమాతరం' (1939) విడుదలైంది. ఆ సమయంలో నేను ఆచారప్పన్ వీధిలో ఉల్లిపాయల వ్యాపారంలో తలమునకలైవున్నాను. వాహిని ప్రొడక్షన్స్ ఆఫీసు టి. నగర్‌లో వుండేది. ఆరోజుల్లో ప్రొడక్షన్ ఆఫీసులోనే కథారచయిత, సంగీత దర్శకుడు, కెమెరామేన్, దర్శకుడు, ఆర్ట్

డైరెక్టరు, నిర్మాత మొదలైన వారంతా కలిసి కథ గురించి తీవ్రంగా చర్చలు జరిపేవారు. ప్రొద్దున, సాయంత్రం టిఫిను, మధ్యాహ్నం, రాత్రి భోజనం అంతా సినిమా ప్రొడక్షన్ ఆఫీసులోనే ఏర్పాటయ్యేది అందరికి.

నేను నా వ్యాపారం పనులు ముగించుకుని సాయంకాలం సుమారు నాలుగున్నరకి జార్జి టౌన్‌లోని 'ఆర్యభవన్' నుంచి టిఫిన్ పార్సిల్ చేయించుకుని టి.నగర్‌లోని మా ప్రొడక్షన్ ఆఫీసుకు తీసుకువెళ్ళేవాణ్ణి. ఆ రోజల్లో మాంబలంలో మంచి హోటళ్ళు లేవు. సాయంత్రం అయితే చాలు నేను తెచ్చే టిఫిన్ కోసం వేచివుండే ప్రొడక్షన్ వాళ్ళంతా "మన విలేజర్ వచ్చాడయ్యా", అనేవారు తమాషాగా.

రచయిత సముద్రాల సీనియర్, నటుడు చిత్తూరు నాగయ్య, కళాదర్శకుడు ఏ.కె. శేఖర్, కెమెరా జీనియస్ కె. రామనాథ్, దర్శకుడు కె.వి. రెడ్డి మొదలైన హేమాహేమీలంతా అన్నయ్యతో అక్కడ సమావేశమై వుండేవారు.

సాయంత్రం నాలుగున్నరదాకా నాన్న దగ్గరుండి వ్యాపారం చూసుకోవడం, ఆ తరువాత ప్రొడక్షనాఫీసులో అన్నయ్య దగ్గర చిత్ర నిర్మాణం గురించిన చర్చలు – ఇలా రోజులు సాగిపోతూ వుండేవి.

◆



## 5

# ఏ కొమ్మ చూసినా 'సుమంగళే'

**అగాథమైన జలనిధిలో ఆణిముత్యముంటుంది.**
**పుటం పెడితేనే బంగారం తళతళ మెరుస్తుంది.**
**ప్రయోగాలు, ప్రయాసలతోనే ఫలితం లభిస్తుంది.**

మా అన్న బి.ఎన్. రెడ్డి వాహిని తరఫున 'సుమంగళి' చిత్రం తీస్తున్న రోజులు (1940). అన్నయ్య స్నేహితుడొకాయన ఆ సినిమాని చెన్నైలో డిస్ట్రిబ్యూషన్‌కి తీసుకోడానికి ముందుకొచ్చాడు. కాని ఆయన చెప్పిన రేటుకి అన్నయ్య అంగీకరించలేదు. అంచేత డిస్ట్రిబ్యూషన్ ఇవ్వనన్నారు. ఆ సమయంలో మదరాసు నగరం మొత్తం లైటు స్థంభాలకి వెదురు దట్టీలు కట్టి వాల్‌పోస్టర్లు అంటించి అడ్వర్టయిజ్ చేసే హక్కుల్ని మద్రాసు కార్పొరేషన్ వారి నుంచి పొందాడు ఆ మిత్రుడు. తనకి 'సుమంగళి' డిస్ట్రిబ్యూషన్ హక్కులు దొరకలేదనే కక్షతో మా సినిమా పోస్టర్లని అంటించడానికి, లైటు స్థంభాలకి వేలాడదీయడానికి అభ్యంతరం తెలిపాడు అతను. నేను స్వయంగా వెళ్ళి మాట్లాడి చూసినా ప్రయోజనం లేకపోయింది. పబ్లిసిటీ లేకుండా సినిమా

విడుదల చెయ్యలేము. ఏం చేయాలో నాకు బోధపడలేదు. చటుక్కున నాకో ఉపాయం తట్టింది. వెదురుదట్టి సైజుకి 500 ఫ్రేములు తయారు చేయించాను. వాటికి గోనె సంచి గుడ్డలు వేసి కుట్టమని చెప్పాను. వాటిమీద మద్రాసు కార్పొరేషన్ వారి ముద్ర వేసిన (పన్నుకట్టిన) 'సుమంగళి' సినిమా పోస్టర్లని అతికించమని చెప్పాను. అందరికీ ఒకటే ఆశ్చర్యం నేనేం చెయ్యబోతున్నానా అని. అలా తయారైన బేనర్లని లారీకెక్కించి తీసికెళ్ళాము. రోడ్డుకి ఇరువైపులా వుండే చెట్లకొమ్మల్ని వంచి కట్టి వాటికి మా 'సుమంగళి' బేనర్లని వేలాడదీసాము. ఇలా నగరంలోని రహదార్ల కిరువైపులా ఎక్కడ చూసినా 'సుమంగళి' తోరణాలే!

మరునాడు నగరంలో ఎక్కడ చూసినా ఈ వినూత్న ప్రచారం గురించిన మాటలే.

రోడ్డుమీద వచ్చేపోయే జనం నెత్తిమీద ఈ సినిమా బేనర్లు తెగిపడే ప్రమాదం వుందని కోర్టులో కేసువేశారెవరో. కార్పొరేషన్ వారి ముద్రని చూపించి వారి పర్మిషన్ తీసుకున్నానని నిరూపించాను. అయినా కోర్టు వారు ఒప్పుకోలేదు. ఆ బేనర్లని తొలగించాలని కార్పొరేషన్‌వారికి ఉత్తర్వులు జారీ చేశారు. రాత్రికి రాత్రి మేము కట్టిన ఆ బేనర్లని తొలగించడానికి వారం రోజులు పట్టింది వారికి. ఆలోగా మా సినిమాకి మంచి ప్రచారం లభించింది.

**సుమంగళి (1940)**

'సుమంగళి' చిత్రం పారగన్ థియేటర్‌లో విడుదలైంది. ఆరోజుల్లో ఆ థియేటర్‌కి రావడానికి జనం వెనకాడేవారు. కారణం చింతాద్రిపేట రౌడీలంతా కలిసి సగానికి పైగా టికెట్లని బ్లాకులో కొనేసి అమ్ముకునేవాళ్ళు. థియేటర్ వాళ్ళేమీ పట్టించుకునేవారు కాదు. ఈ సంగతి తెలిసి నేను అక్కడికి స్వయంగా వెళ్ళాను. ఆరోజుల్లో వుల్లిపాయల ఎగుమతి పనులకని మదరాసు హార్బర్‌లో నాకింద యాభై మందికి పైగా లోడ్‌మేన్‌లు పనిచేసేవారు. వాళ్ళని తీసుకుని పారగన్ థియేటర్‌కి వెళ్ళాను. వాళ్ళని థియేటర్ ప్రాంగణంలో అక్కడక్కడా నిలబెట్టాను. "ముందుగా నేనొక రౌడీని పట్టుకుని కొడతాను. వెంటనే వాళ్ళు గుంపుగా వచ్చి నామీద దాడిచేస్తారు. అప్పుడు మీరంతా కలిసి వాళ్ళని చితకబాదండి", అని చెప్పాను మా మనుషులతో. కొన్నాళ్ళు నేను బాక్సింగు నేర్చుకోవడం అప్పుడు నాకెంతో ఉపయోగపడింది. అంతా నేనూహించినట్టే జరిగింది. మావాళ్ళ దెబ్బలకి ఆ రౌడీలు వెనక్కి తగ్గారు. వాళ్ళ లీడర్‌ని దగ్గరకి పిలిచి 'బ్లాకులో టికెట్లమ్మితే మీకెంత దొరుకుతుంద'ని అడిగాను.

"అర్థ రూపాయి", అని చెప్పాడు.

"నేను రూపాయిస్తాను. నేను చెప్పిన పని చేస్తావా?" అని తలా ఒకరికి 500 'సుమంగళి' సినిమా కరపత్రాలిచ్చి ఒక్కో హోటలు ముందు నిలబడి హోటల్లో భోంచేసి బైటికి వచ్చేవాళ్ళందరికి ఆ కరపత్రాలు పంచమని చెప్పాను. పొద్దున రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు – రోజుకి నాలుగ్గంటల పని. సంతోషంగా అంగీకరించారు. ఈరకంగా మా సినిమాకి మంచి ప్రచారం లభించింది.

ఆ తరువాత వారంలో బస్టాపులు, ట్రాముల దగ్గర నిలబడి కరపత్రాలని లోపలికి వెదజల్లమని చెప్పాను. వాహనాల నిండా చెత్త నిండిపోతూ వుందని ట్రాన్సుపోర్టు వాళ్ళు మామీద కేసు కూడా పెట్టారు. ఇదంతా గమనించిన జెమిని స్టూడియో అధిపతి ఎస్.ఎస్. వాసన్ "పబ్లిసిటీ కోసం నేనెంతో డబ్బు తగలేస్తున్నాను. నువ్వేమో అతి తక్కువ ఖర్చుతో మంచి పబ్లిసిటీ తెచ్చుకుంటున్నావు నీ సినిమాకి", అని నన్ను మెచ్చుకున్నారు.

'సుమంగళి' సినిమాని తమిళంలో నిర్మించి విడుదల చెయ్యడానికి మా దగ్గర్నుంచి హక్కులు కొనుక్కున్నారు ఎస్.ఎస్. వాసన్.

◆



## 6

## ఫైరు గాలి

ఓహో నెలవంకా!
చిన్నదానివని చింతలు పోనేల?
పూర్ణచంద్రబింబమొకటి నీలో దాగున్నది కదా?
- అన్నాడు ఇక్బాల్ మహాకవి.

**కష్టాలు, నష్టాలు వచ్చినప్పుడే మనోనిబ్బరం అవసరమౌతుంది.**

**మనిషి కుంగి కుదేలై కూర్చుండిపోయినప్పుడు అతని భుజం తట్టి పైకి లేపుతుందొక అదృశ్య శక్తి. అదే ఆత్మవిశ్వాసమనే అద్భుతశక్తి!**

రెండో ప్రపంచ యుద్ధ సమయంలో మా సరుకులు నింపుకుని వెళ్ళిన ఓడ జపాన్ సైనికుల చేతుల్లో చిక్కుకుంది. సరుకులు పోతే పోనీ ఓడలో వెళ్ళిన మా మనిషి పోతే ఏం చెయ్యాలి? మా యూసఫ్‌భాయ్ కుటుంబానికి మేమేం బదులు చెప్పాలి?

ఇంతకీ ఎవరీ యూసఫ్‌భాయ్?

నిజాయితీతో కష్టపడి పనిచేస్తే జీవితంలో ఎవరైనా పైకి రాగలరని నమ్మినవాడు మా నాన్నగారు. ఈ కారణంచేతనే యువప్రాయంలోనే రైతుల విశ్వాసాన్ని చూరగొన్నాడు. ఉల్లిపాయల వర్తకంతో బాటు మా సొంత వూర్నుంచి వేరుశెనగ కాయలు సేకరించి మద్రాసుకి తెచ్చి విక్రయించే కమీషన్ వ్యాపారం చేసేవారాయన. వ్యాపారం బాగా సాగుతున్న రోజుల్లో ఒకతను నాన్నగారికి నమ్మకద్రోహం చేశాడు. అది నాన్నని బాగా దెబ్బతీసింది. అతని దగ్గర్నించి పైకం వసూలు చెయ్యలేకపోయారు. ఊరికి ఎలా వెళ్ళడం? తనకి వేరుశెనగకాయలు అమ్మిన రైతులకి ఎలా పైకం చెల్లించడం? మనోవేదనతో క్రుంగిపోయారు. ఒకటే దారి కనిపించింది ఆయనకి – ఆత్మహత్య!...

ఆత్మహత్య చేసుకోవాలని మెరీనా సముద్రతీరం చేరుకున్నారు. ఆ సమయంలో ప్రార్థన చేసుకోడానికని అక్కడికొచ్చిన ముస్లిం ప్రముఖుడొకతను నాన్న వుద్దేశ్యం గ్రహించి ఆయన్ని పట్టుకుని ఆపి వివరాలడిగాడు. జరిగిందంతా వివరించారు నాన్న. ఆయన కుటుంబం గురించి, నిజాయితీ గురించి తెలుసుకున్న ఆ ఇస్లాం ప్రముఖుడు “మీ సమస్యకు ఆత్మహత్యే పరిష్కారమా?”, అంటూ నాన్నని తన యింటికి తీసుకుని వెళ్ళాడు. రెండు రోజులు తన దగ్గరే వుంచుకుని ఆతిథ్యమిచ్చి కొంత పైకం కూడా యిచ్చారు. బతుకుమీద నమ్మకం కలిగించి ధైర్యం చెప్పి “మీవాళ్ళ కోసమైనా మీరు జీవించాలి”, అని సాగనంపారు.

వెలలేని ఆ ఉపకారానికి ప్రత్యుపకారంగా ఆ తరువాత కాలంలో ఆ ముస్లిం ప్రముఖుడి కుటుంబ సభ్యుల్లో ఒకరైన యూసఫ్‌ని తన దగ్గర పనికి తీసుకొన్నాడు నాన్న.

నేను రంగూన్నించి తిరిగొచ్చి వివాహం చేసుకున్నాక నాన్న దగ్గర వుండి వ్యాపారం చూసుకోవాల్సి వచ్చింది. అంచేత సరుకులు నింపుకుని రంగూన్ వెళ్ళే ఓడలో యూసఫ్‌ని పంపాల్సి వచ్చింది. రంగూన్‌లో సరుకులు డెలివరి చేసి పైకం వసూలు చేసుకుని వచ్చేవాడు యూసఫ్.

రెండో ప్రపంచయుద్ధం ప్రారంభం కాగానే నాన్న ‘ఓరంపాడు’ గ్రామానికి వెళ్ళిపోయారు. అన్న మదరాసులోనే వుండిపోయాడు. జపానువాళ్ళు మా షిప్పుని పట్టుకున్న వెంటనే అమ్మతోపాటు మా కుటుంబమంతా మా మామగారింటికి నెల్లూరు వచ్చేసాము. మామగారికి నెల్లూరులో వేరే యిల్లుండేది. మేమందరం ఆ యింట్లో కాపురమున్నాము. నెల్లూరు ఎండలకి తట్టుకోలేక మా పసిబిడ్డ రెండేళ్ళ రామకృష్ణ మమ్మల్ని వదిలిపోయాడు. ఓడ పట్టుబడిన దుఃఖం ఒకవైపు, మా బిడ్డ

మరణించిన శోకం మరోవైపు - ఈ జంజాటంలో నాకు జీవితం మీద విరక్తి కలిగింది. అప్పుడు మా తమ్ముడు కొండారెడ్డి మా పరిస్థితి గురించి మద్రాసులో వున్న మా అన్నతో చెప్పాడు. మమ్మల్ని ఓరంపాడు గ్రామానికి వెళ్ళి వుండమన్నాడు అన్నయ్య.

ఇక్కడ ఓరంపాడు గురించి చెప్పి తీరాలి.

నాన్నగారు వ్యాపారానికి సంబంధించిన లావాదేవీల్లో ముమ్మరంగా వున్న రోజులు. తిరుపతికి ఉత్తరాన కోడూరు దగ్గర వుండే ఊరు ఓరంపాడు. ఆ ఊళ్ళో ఒకాయన మా నాన్నకి కొంత పైకం బాకీపడ్డాడు. తిరిగి చెల్లించలేక తన భూమిని నాన్నగారికి అమ్మాడు. ఆ నేలలో బత్తాయి, నిమ్మ తోటలు వేసి పండిస్తూ అక్కడ ఒక గుడిసె వేసుకున్నారు నాన్న. దానికి అనుబంధంగా మరో పూరిల్లు కట్టుకుని మేమంతా అందులో దిగేము. చెట్టు చేమలతో పచ్చగా కళకళలాడుతూ వుండేది ఆ వూరు.

ప్రకృతి మనకు ప్రసాదించిన వరాల్లో ముఖ్యమైనది వృక్షసంపద. సూర్యుడు తన కిరణాల ద్వారా భగవంతునికి నమస్కరిస్తున్నాడు. చెట్లు తమ పూలని రాల్చి తమని భరించే భూమాతని పూజిస్తున్నాయి.

అటువంటి వృక్ష సంపదకి కృతజ్ఞతా సూచకంగా 'విజయా గార్డెన్సు' నిర్మించి పెంచి పోషిస్తూ వస్తున్నాను. ఒక్క రెమ్మ విరిగినా సహించను. ఒకవేళ ఏ చెట్టునయినా కొట్టాల్సిన అవసరం ఏర్పడితే అడ్డుకుని ఆ చెట్టుని వేళ్ళతో పెకిలించి మరోచోట పాతిపెట్టిస్తున్నాను. అలా స్థలం మారిన చెట్టుని జాగ్రత్తగా పోషించుకుంటున్నాను. రోజంతా ఆ తరులతానికుంజముల నడుమ విహరిస్తూ ఆనందిస్తున్నాను. చెట్లు, మొక్కలు, లతలు ప్రకృతి మనకు ప్రసాదించిన వెలలేని సంపద. కనుకనే పూర్వం నుంచి చెట్లని దైవంగా పూజిస్తున్నాము.

ఓరంపాడు గ్రామాన్ని తలుచుకున్నప్పుడల్లా ఎన్నెన్నో మధురానుభూతులు నాలో. తెల్లవారుజామునే లేచి మా పొలంలోని పంట బావిలోంచి ఏతాము ద్వారా నీళ్ళు తోడి పొలాల్ని తడపడం, సాయంకాలాలు కల్లాకపటమెరుగని పల్లెటూరి పసిపిల్లల్ని బావిగట్టుమీద కూచోబెట్టుకుని రామాయణం, భారతం, భాగవతాల్లోని పిట్టకథలు చెప్పి వారికి విజ్ఞానం, వినోదం కలిగించడం - ఇత్యాది కార్యకలాపాల్లో మునిగి, నాలోని కలతని కలవరాన్ని తగ్గించుకుని మానసికంగా ఉపశమనం పొందగలిగేను.

◆

## 7

# తీరిన ఋణం - తీరని ఋణం

ఓరంపాడు గ్రామంలో మేం నివాసమున్న రోజుల్లో మా గుడిశ నేలని శుభ్రం చేసి, పేడ అలికి, ముగ్గులు పెట్టి అన్ని యింటి పనుల్లోను అమ్మకి కుడి భుజంగా వుండేది నా భార్య శేషమ్మ.

నెల్లూరు వాళ్ళు వరి అన్నం తింటారు. మా రాయలసీమలో అంతా జొన్నన్నం, రాగిసంకటి తింటారు. మా శేషమ్మ కోసమని బియ్యం తెప్పించే వాళ్ళం. అంచేత మా అందరికి కూడా వరి అన్నం తినడం అలవాటైంది.

అప్పులవాళ్ళు నన్ను వెతుక్కుంటూ వచ్చారు. నన్ను నమ్మి ఋణాలిచ్చిన వాళ్ళని మోసం చెయ్యలేను కదా? వాళ్ళ ఋణం తిరిగి చెల్లించడానికి తీవ్ర ప్రయత్నాలు చెయ్యసాగాను. కాని ఖాతాదార్ల దగ్గర్నుంచి రావాల్సిన పైకం నాకు అందలేదు. వాళ్ళ అడ్రసు కూడా నాకు తెలీదు. వాళ్లసలు బతికున్నారా, వుంటే ఎక్కడున్నారు, ఏం చేస్తున్నారు. వారిని ఎట్లా కలుసుకోవడం? – ఇవేమీ నాకు తెలీదు. ఇలా వుండగా రంగూన్ నుంచి నాకో వుత్తరం వచ్చింది. దిక్కుతోచకుండా మండుటెండలో

అలమటిస్తున్న వానికి చల్లని చెట్టు నీడ దొరికినట్లయింది. ఇస్మాయిల్ ఆఫీసులో పనిచేసే రతిలాల్ అనే గుమాస్తా రాసిన లేఖ అది. అందులో నాకు డబ్బులివ్వాల్సిన వాళ్ళు కరాచి దగ్గర హద్దూరాం అనే ఒక వూళ్ళో వుంటున్నట్టు తెలిపారు (అప్పటికి దేశవిభజన జరగలేదు).

మన ఖాతాదారుల ఆచూకి దొరికింది. హద్దూరాం వెళ్ళి డబ్బులు వసూలు చేసుకుని రావచ్చులే అనుకున్నాను. కాని ఇక్కడ కూడా ఒక యిబ్బంది ఎదురైంది. అప్పుడు రెండో ప్రపంచ యుద్ధం జరుగుతూ వుంది. దేశమంతటా స్వాతంత్ర్య సంగ్రామం ఉధృతమైంది. ఈ కారణాల వల్ల రైల్లో ప్రయాణం చెయ్యటం కూడా ప్రమాదంగా వుంది. ఇప్పుడు వెళ్ళడం మంచిది కాదు అని అందరూ నన్ను హెచ్చరించారు. కాని నా అప్పులవాళ్ళకి నేను బాకీ చెల్లించాల్సి వుంది కదా? ఏమైతే అయిందని అందరికి నచ్చజెప్పి కరాచి ప్రయాణమయ్యాను.

కరాచికి కొద్ది దూరంలో వుంది హద్దూరాం గ్రామం. అక్కడ రైలు స్టేషన్ లేదు. సిగ్నల్ కొరకు కాసేపు మాత్రం రైలు ఆగే ఫ్లాగ్ స్టేషన్ అది. రైల్వే ఎప్రెంటీస్ ట్రైనింగు కోసం వచ్చేవాళ్ళు, అందులోనూ పెళ్ళికాని వారు మాత్రమే వుంటుంటారు ఆ వూళ్ళో. అప్పుడంతా రైళ్ళకు ఆవిరి యింజన్లే. సిగ్నల్ కోసం హద్దూరాంలో రైలాగినప్పుడల్లా చుట్టుపక్కల నివసించే ఆడవాళ్ళంతా బక్కెట్లు చేతపుచ్చుకుని బిలబిలమని ఇంజన్ దగ్గర చేరేవాళ్ళు. ఇంజన్‌లోంచి వచ్చే వేణ్ణీళ్ళు పట్టుకుని వెళ్ళేవారు. ఆ నీటిని స్నానానికి వాడుకునేవారు.

నేను వూళ్ళోకి వచ్చానని తెలుసుకుని నా బాకీ తీర్చాల్సిన వాళ్ళు ఇళ్ళు వదిలి బైటికి రాలేదు. అంతా ఎక్కడో దాక్కున్నారు. పైకం వసూలవుతుందనే నమ్మకం పోయింది నాకు. మళ్ళీ నాలో కలవరం. ఏం చెయ్యాలి? నాకా ఆ వూళ్ళో ఎవరూ తెలీదు. అప్పుడు జరిగిందా ఆశ్చర్యకరమైన సంఘటన! దిక్కు తెలీకుండా గాఢాంధకారంలో అల్లాడుతున్న నాకు జ్యోతి వలె ఎదురైంది ఆవిడ. నన్ను గుర్తించిన వెంటనే ఆమె ముఖంలో ఆనందజ్యోతులు. ఆవిడ ఎవరో కాదు. ఒకనాడు రంగూన్‌లో నన్ను కన్న తల్లివలె చేరదీసి ఆదరించి అన్నం పెట్టిన ఆ మహాతల్లే ఆమె. నేనుండే పరిస్థితి వివరంగా చెప్పాను. నాకు ధైర్యం చెప్పింది. నూనె రాసుకుని స్నానం చెయ్యమంది. ఆ తరువాత కడుపు నిండా భోజనం పెట్టి “నీ డబ్బులు వసూలు కావడానికి నా చేతనైన సాయం చేస్తాను. అందాకా ఇక్కడే వుండు”, అని అభయమిచ్చింది. ఉపయోగంలో లేకుండా సిగ్నల్ పక్కన నిలిచి వున్న ఒక పాత

రైలు పెట్టెలో మూడు రోజులున్నాను. మూడో రోజు వచ్చి నన్ను పిలుచుకుని వెళ్ళింది ఆమె. అక్కడ ఒక చెట్టుకింద నా ఖాతాదార్లంతా సమావేశమై వున్నారు. నేను వచ్చిన సంగతి తెలిసిన వెంటనే పారిపోయి దాక్కున్న వారినంతా అక్కడికి ఎలా రప్పించిందా ఈమె అని ఆశ్చర్యం వేసింది నాకు. ఆమె ఒక్కొక్కరి దగ్గరికి వెళ్ళి నా యిబ్బందుల గురించి, నేనున్న విపత్కర పరిస్థితుల గురించి వివరించి చెప్పింది. నాక్కూడా వాళ్ళ పరిస్థితి తెలియజేసింది. యుద్ధం ప్రారంభం కాగానే బాంబులదాడి తప్పించుకోవడానికి అన్నీ వదులుకొని కట్టుబట్టలతో కరాచి చేరుకున్నారు వారంతా. అటువంటి వారిపట్ల ఖచ్చితంగా ఎలా వుండగలను? నా భుజం మీదున్న తుండుగుడ్డను వారి ముందు పరిచాను.

"మిమ్మల్ని పీడించి నా డబ్బు వసూలు చేసుకోవటానికి రాలేదు నేను. నాకూ అప్పుల బాధ వుంది. ఆ అప్పు ఎంతో కొంత తీర్చాలి నేను. మీ మిత్రునిగా మీలో ఒకనిగా అర్థిస్తున్నాను. ఇదిగో ఈ తుండుగుడ్డ మీద మీకు తోచినంత పడవెయ్యండి. బలవంతం లేదు", అని చెప్పి ముగించాను.

వారి వారి స్తోమతకి తగినట్టు డబ్బులు వేసారు. ఆ డబ్బంతా మూటగట్టుకుని మొలకి కట్టుకున్నాను.

దిక్కుతెలియని పరాయి దేశంలో ఆ మహాతల్లిని కలుసుకోవడం, ఆ తల్లి నాకు చేసిన ఈ మేలు, అప్పు కొంత వసూలు కావడం నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది. ఉద్వేగంతో నాకు మాటలు పెగల్లేదు. మౌనంగా ఆ తల్లి పాదాలను నా కన్నీటితో అభిషేకం చేశాను.

డబ్బుతో ఆరోజే వూరికి తిరుగు ప్రయాణమైనాను. ఆ యమ్మ తడిసిన నేత్రాలతో స్టేషన్ దాకా వచ్చింది నన్ను సాగనంపడానికి. కన్నబిడ్డకి తెచ్చినట్టుగా రైల్లో తినడానికి నాకు ఆహారం కూడా పట్టుకొచ్చింది.

వసూలైన డబ్బుతో వూరికి తిరిగొచ్చాను. ముఖ్యమైన అప్పులు కొన్ని తీర్చగలిగాను. ఆ తరువాత కొన్నాళ్ళకి నా అప్పులన్నీ తీరిపోయాయి. అయినా నన్నాపద సమయంలో ఆదుకున్న ఆ తల్లి రుణం మాత్రం తీర్చుకోలేకపోయాను. ఇది జరిగి దాదాపు అరవై సంవత్సరాలు కావస్తున్నది. అయినా ఆ తల్లి నా స్మృతిపథంలో మెదులుతూనే వుంది. నేనేమో హిందువుని. ఆమె యేమో ముస్లిం స్త్రీ, అయినా కన్నకొడుక్కన్నా మిన్నగా నన్ను ఎందుకు ఆదరించింది? అభిమానించింది?

మతాలకి అతీతమైనది కదా మానవత! కాని ఇప్పటి పరిస్థితేమిటి? మతం పేరుతో, కులం పేరుతో కలహాలు! మారణహోమాలు! రక్తపాతాలు! ఎప్పటికి మారుతుందీ పరిస్థితి?

చివరికి నా అప్పులన్నీ ఎలా తీర్చగలిగానో తెలుసా? అప్పు తీర్చమని తన నగలన్నీ తీసిచ్చింది నా భార్య శేషమ్మ. మా వదిన నగలు కూడా తాకట్టు పెట్టి డబ్బు తెచ్చాను. అదీ చాలకపోగా జార్జిటవునులోని మా యింటిని అమ్మాల్సి వచ్చింది. ఇదంతా చేసి అప్పు తీర్చగలిగాను. ఆ తరువాత కొన్నాళ్ళకి వదినగారి నగలు విడిపించి యిచ్చాను. కాని శేషమ్మ మాత్రం తన నగల్ని విడిపించి తెమ్మని చివరిదాకా నన్ను అడిగింది లేదు. నేను విడిపించి తేనూ లేదు. తనకంటూ ఏదీ కోరుకోని మహా ఇల్లాలు మా శేషమ్మ.

మాది అనుకూల దాంపత్యం. ఆనంద దాంపత్యం. ఆదర్శ దాంపత్యం.

కష్టాల్లో నాకు తోడు నీడగా, తల్లిగా నన్నాదుకున్న ఇల్లాలు నా శేషమ్మ.

◆



## 8

# బి.ఎన్.కె. శకం

**అదొక ఉద్యానవనం. శీతాకాలపు సంధ్యా సమయం. గుర్రం మీద వచ్చిన ఆ రౌతు అక్కడ కాసేపు విశ్రాంతి తీసుకుంటాడు.**

**ఆ ప్రశాంత ప్రదేశంలో శాశ్వతంగా వుండిపోవాలని తలుస్తాడు. కాని తనింకా వెళ్ళాల్సిన దూరం చాలా వుంది అని హెచ్చరిక చేసి బాధ్యతని గుర్తు చేసింది అతని అంతర్వాణి.**

**- అమెరికన్ కవి రాబర్ట్ ఫ్రాస్ట్**
**'అండ్ మైల్స్ టు గో' అనే కవిత సారాంశం యిది.**

పండిత జవహర్‌లాల్ నెహ్రూ రైటింగ్ టేబుల్ మీద ఎల్లప్పుడూ కనిపిస్తుందీ కవిత.

జీవన పథంలో ఎన్నో మజిలీలు. రకరకాల అనుభవాలు. నేను ఓరంపాడు గ్రామానికి వెళ్ళిన కొంతకాలానికి నాకో ఉత్తరం అందింది. 'నీకు మంచి తెలివితేటలు, వ్యాపార దక్షత వున్నాయి. ఆ పల్లెటూరిలో వుంటూ వాటిని వృథా చేయడమెందుకు.

వెంటనే మద్రాసు బయలుదేరిరా' అని మా అన్న బి.ఎన్. రెడ్డితో పాటు కళాదర్శకుడు ఏ.కె. శేఖర్, దర్శకులు కె.వి. రెడ్డి, మూలా నారాయణస్వామి కలిసి సంతకం చేసి పంపిన లేఖ అది.

మద్రాసు వచ్చేశాను.

'భక్తపోతన' చిత్రం బెంగుళూరులో విడుదల కాబోతూ వుంది. "నువ్వు మన సినిమాకి పబ్లిసిటీ వ్యవహారాలు చూడాలి' అని చెప్పి నన్ను వెంటనే బెంగుళూరు పంపించారు. ఊరంతా బాగా తిరిగిచూశాను. అదే సమయంలో జెమిని వారి 'బాలనాగమ్మ' కూడా బెంగుళూరులో విడుదల కానుంది. వారు చేసిన పబ్లిసిటీ బ్రహ్మాండంగా వుంది. ఎక్కడ చూసినా 'బాలనాగమ్మ' పోస్టర్లే. వీటిమధ్య 'భక్తపోతన' సినిమా పబ్లిసిటీ ఎలా చెయ్యాలా అని కొంచెం భయం వేసింది నాకు. కేవలం పోస్టర్లతో వీరి పబ్లిసిటీని మించిపోవడం సాధ్యం కాదు. వేరే ఏదయినా వుపాయం ఆలోచించాలి. ఈ ఆలోచనలతో నడుస్తూ వెళుతుండగా మల్లేశ్వరం సర్కిల్ మిట్ట వచ్చింది. చటుక్కున ఓ మంచి ఐడియా తట్టింది. వెంటనే విజయవాడ నుంచి మదరాసు నుంచి నిపుణులైన కార్పెంటర్లని, పెయింటర్లని బెంగుళూరు రప్పించాను. ముప్ఫై అడుగుల ఎత్తుకి గదాధారియైన ఆంజనేయుని కటౌట్ చేయించాను. పదడుగుల ఎత్తుగల పీఠం చేయించి దానిమీద 'భక్తపోతన' సినిమా ప్రకటన రాయించాను. రాత్రికి రాత్రి మల్లేశ్వరం మిట్టమీద ఆ కటౌట్‌ని పెట్టించాను. ఆ మరుసటి రోజు నుంచి మల్లేశ్వరం సర్కిల్ దగ్గర తీర్థప్రజలా జనం. ఆంజనేయస్వామి మల్లేశ్వరంలో వెలిసినట్టు కుటుంబాలకి కుటుంబాలే అక్కడికి వచ్చి ఆంజనేయస్వామి వారి కటౌట్‌ను దర్శించుకుని వెళ్ళసాగారు. అలా 'భక్తపోతన' సినిమాలో వచ్చిపోయే ఆంజనేయస్వామి మా చిత్రానికి బ్రహ్మాండమైన పబ్లిసిటీని అనుగ్రహించాడు.

'భక్తపోతన' బెంగుళూరు మూవీలేండ్ థియేటర్‌లో రిలీజైంది (1942). ఆ ముందు రోజు 'క్యూ సిస్టం ఏర్పాటుచెయ్యండి, లేకుంటే జనాన్ని కంట్రోలు చెయ్యడం కష్టం' అని బుక్కింగ్ క్లర్కుతో చెప్పాను. కాని అతను నా మాటల్ని ఖాతరు చెయ్యలేదు. ఆంజనేయస్వామి కృప చేత సినిమా విడుదలైన రోజు హాలు ముందు ఇసుక వేస్తే రాలనంతమంది జనం. టికెట్ కౌంటర్‌నే ధ్వంసం చేశారు. ఎలాగో జనాన్ని కంట్రోల్ చేసి ఆ రాత్రికే క్యూ సిస్టం పెట్టడమైంది. 'భక్తపోతన' ఘన విజయం సాధించింది. నేను మళ్ళీ మా ఓరంపాడు గ్రామం చేరుకున్నాను.

అన్నయ్య బి.ఎన్. రెడ్డి, కె. రామ్‌నాథ్. ఫైనాన్షియర్ మూలానారాయణ స్వామి, కళాదర్శకుడు ఏ.కె. శేఖర్, డైరెక్టర్ కె.వి. రెడ్డి ఈ అయిదు మంది నన్ను మద్రాసుకే

'భక్తపోతన' ఆంజనేయుడు



కె.వి. రెడ్డి, కె. రామ్‌నాథ్, ఏ.కే. శేఖర్

వచ్చి స్థిరపడిపొమ్మన్నారు. నేను ససేమిరా అన్నాను. 'ఆర్థిక సమస్యల కారణంగా నువ్వు రావడానికి వెనుకాడుతున్నావు. ఇక్కడికి రాకుంటే మంచి మిత్రులని కోల్పోగలవు' అని వుత్తరం రాయడమే కాకుండా నన్ను వెతుక్కుని ఓరంపాడు గ్రామానికే వచ్చేశారు రామ్‌నాథ్. అతని వత్తిడి వల్ల అంగీకరించాను. ఆ సమయంలో అక్కడికొచ్చిన మా మామగారు నా పరిస్థితి గుర్తించి కొంత ఆర్థిక సాయం చేశారు. దీంతోపాటు నా నేస్తాలు ఆ అయిదుగురూ తలా వెయ్యి రూపాయలు నా చేతికిచ్చారు. మొత్తం పదివేల రూపాయలతో ఆచారప్పన్ వీధిలో అంతకు ముందే వున్న బి.ఎన్.కె. ప్రెస్సుని పునఃప్రారంభించాను. మరో అచ్చు యంత్రం కూడా కొన్నాను. ఈ సందర్భంలో మరో మంచి మలుపు నా జీవితంలో. యూసఫ్ మూలంగా జరిగింది అది. అలనాటి షిప్పుతో పాటు అదృశ్యమైన మా యూసఫ్‌భాయ్ ఎలాగో తంటాలుపడి జపాన్ వాళ్ళ దగ్గర్నించి తప్పించుకుని మద్రాసుకి వచ్చి చేరాడు. మా ఉల్లిపాయల వ్యాపారంలో యథాప్రకారం సాయపడసాగాడు. నేను ప్రెస్సు పనిలో మునిగిపోయాను.

బి.ఎన్.కె. ప్రెస్సులో శుభలేఖలు అచ్చు వేయడానికి ఇంత ఖరీదు అని నిర్ణయించలేదు. కస్టమర్లు ఇష్టపడి ఎంతిస్తే అంతే! బి.ఎన్.కె. ప్రెస్సులో శుభలేఖలు అచ్చు వేస్తే అంతా శుభమే జరుగుతుంది అనే ఒక నమ్మకం ఏర్పడింది, మా వాడుకదారుల్లో. ఈ నమ్మకమే మా ప్రెస్సు అభివృద్ధి సాధించడానికి కారణమైంది.

రామకృష్ణ మిషన్ ఆశ్రమానికి నేను తరచుగా వెళుతుండేవాడిని. "మీరేం చేస్తుంటారు?", అని అడిగారు ఆశ్రమ నిర్వాహకుల్లో ఒకతను. "ప్రింటర్‌ని", అని చెప్పాను. "మా ఆశ్రమ పుస్తకాలని మీరు ప్రింటు చేసి ఇవ్వగలరా?", అని అడిగారు.

'సరే' అన్నాను. మొదట్లో చిన్న చిన్న జాబ్‌లే యిచ్చారు. కొన్నాళ్ళకే రామకృష్ణ మిషన్ 'అఫిషియల్' ప్రింటర్‌గా ఎదిగాను. ఆశ్రమానికి సంబంధించిన అచ్చు పనులన్నీ బి.ఎన్.కె. ప్రెస్సులో జరిగేవి. నేనే స్వయంగా ప్రూఫులు చూసేవాడిని. అప్పుడు ఇంగ్లీషు భాషలో నాకంతగా ప్రవేశం లేదు. అంచేత పక్కనే ఒక డిక్షనరీ పెట్టుకునేవాణ్ణి.

జీవితంలో ఒక కొత్త దారి - ఆధ్యాత్మిక మార్గాన్ని చూపించింది నాకు రామకృష్ణా మిషన్.

ఆ తరువాత హైస్కూలు కోణార్క్ నోట్సు, స్కూలు పుస్తకాలు - ఇలా చాలా ఆర్డర్లు రావడం మొదలైంది మా ప్రెస్సుకి.

◆



## 9

# 'వాహినీ' శకం

ప్రపంచంలో మూడు రకాలైన మనుషులున్నారు అన్నాడు బట్లర్ అనే రచయిత.

1. **కార్యసాధకులు**
2. **ఇతరులు సాధించే కార్యాలని కేవలం చూస్తూ వుండేవాళ్ళు.**
3. **తమచుట్టూ ఏం జరుగుతూ వుందో కూడా గ్రహించలేనివారు.**

ప్రతి మనిషి తన సత్ప్రవర్తన వల్ల జీవితాన్ని దిద్దుకుంటాడు. ఉన్నత శిఖరాలనధిరోహించగలుగుతాడు.

వాహిని సంస్థకి ఆర్థిక సహాయం అందిస్తూ వచ్చిన మూలా నారాయణస్వామికి ఇన్‌కమ్‌టాక్స్ నుంచి నోటీసు వచ్చింది. ఆదాయం పన్ను కింద ఒక పెద్ద మొత్తం కట్టాల్సి వచ్చింది ఆయన. 'కొంత పైకం సర్దగలవా?' అని అడిగారు ఆయన నన్ను. అప్పుడే నేను కుటుంబంతో సహా ఆచారప్పన్ వీధి నుంచి టి.నగర్‌కు మకాం

వాహినీ స్టూడియో ప్రధాన కార్యాలయం


VIJAYA - VAUHINI
Studios

మార్చాను. అందుచేత డబ్బుకి కొంచెం కటకట. వాహిని సంస్థకి అన్నయ్య బి.ఎన్.రెడ్డి గారే మేనేజింగ్ డైరెక్టరు. నారాయణస్వామికి ఎందుచేతనో సాయం చేయలేదు అన్నయ్య.

ప్రెస్సులో వున్న డబ్బు, చక్రపాణి వంటి మిత్రుల ద్వారా సేకరించిన పైకమూ కలిపి నారాయణస్వామికి ఆర్థిక సహాయం చేయగలిగేను. అందుచేత వాహిని సంస్థకి ఇకనుంచి నాగిరెడ్డే ఎం.డి. అని తీర్మానించేశారు. అన్నగారికీ విషయం చెప్పాను. "నువ్వు ఒప్పుకోకపోతే నీ స్థానంలో వేరేవాళ్ళను నియమిస్తాడు మూలా నారాయణస్వామి. అంచేత వెంటనే ఒప్పేసుకో", అన్నారు. సరే అన్నాను.

అప్పుడు 'గుణసుందరి కథ' నిర్మాణంలో వుంది.

మూలా నారాయణస్వామి మదరాసులో స్టూడియో నిర్మాణం తలపెట్టి, ఆ నిమిత్తం మా అన్నని బొంబాయి వెళ్ళి అక్కడున్న స్టూడియోని చూసి రమ్మన్నారు. అప్పుడు వాహిని మెయిన్ బిల్డింగు పనులు జరుగుతున్నాయి. ఇన్‌కమ్ టాక్సు ఇబ్బందులవల్ల ఆ నిర్మాణం పనులు కొనసాగించలేకపోయారు ఆయన. ఇక్కడ మరో ముఖ్యమైన సంగతి చెప్పాలి; ఆయన పేరు రమణారెడ్డి. మంటపంపల్లి గ్రామం ఆయనది. పట్టభద్రుడు. నాకు మంచి మిత్రుడయినాడు. వారికి విశాలమైన తోట ఒకటుంది.

వాహిని స్టూడియో నిర్మాణం సగంలో ఆగిపోవడం చూసిన ఆ మిత్రుడు "నేను పాతికవేలిస్తాను స్టూడియో పనులు పూర్తిచేయండి", అన్నాడు. నేను కొంచెం సంకోచించాను.

"నాకు ఇరవై అయిదు వేలు పోతే నా తోట ఆదాయంలో ఆ డబ్బు నష్టమైందని సరిపెట్టుకోగలను. కాని నీ స్టూడియో అసంపూర్తిగా ఆగిపోతే ఎంత నష్టమో ఆలోచించు", అని పాతికవేల రొక్కం నా చేతికిచ్చాడు రమణారెడ్డి. ఈరోజు అతను నా వియ్యంకుడు. మా అబ్బాయి వేణుకి మామగారు. ఈ డబ్బు పుచ్చుకునే ముందు ఒక అగ్రిమెంటు రాసుకోవాలన్నాడు మూలా. కాని అలా చేయడంలో ఇన్‌కమ్‌టాక్సు చిక్కులు వచ్చే అవకాశముంది. ఇన్‌కమ్‌టాక్సు వాళ్ళు పన్ను బాకీ కింద మా స్టూడియోను ఎటాచ్ చేసినా చెయ్యొచ్చు.

అగ్రిమెంటు చేసుకున్న ఆరు నెలల్లోపు ఎటాచ్‌మెంటు కాలేదంటే ఏ సమస్యా రాదు అని ధైర్యం చెప్పారు ఇన్‌కమ్‌టాక్సు నిపుణులు.

“ఈ ఆదాయం పన్ను కేసు పరిష్కారం అయిన తరువాత మొత్తం పైకం చెల్లించి స్టూడియోను నేనే తీసుకుంటాను. అందాక స్టూడియో నీ పేరనే వుండనీ”, అన్నాడు మూలా నారాయణస్వామి.

స్టూడియోకి అప్పటికే 'వాహిని' అని పేరు పెట్టడం జరిగింది. అర్జునుడికి విజయుడనే పేరుంది. అలాగే ఆంజనేయుడికి కూడా విజయుడనే పేరుంది. అందుచేత ఆంజనేయుని చిత్రం వున్న పతాకంతో 'విజయా ప్రొడక్షన్స్' స్థాపించాను.

'జెండాపై కపిరాజు' మా విజయ సంస్థ చిహ్నమైంది. మా చక్రపాణిగారు కూడా ఈ బేనర్ బాగుందనడం నాకు పరమ సంతోషం కలిగించింది. ఆయన కూడా విజయా ప్రొడక్షన్సులో భాగస్థుడైనాడు. వాహిని స్టూడియోని విజయా ప్రొడక్షన్సు పేరుతో లీజుకు తీసుకుని నిర్వహించాము.

స్టూడియోలో మెయిన్ బిల్డింగు ఒక రికార్డింగు థియేటరు, ఒక ఫ్లోరు మాత్రమే వుండేవి. తిరునల్వేలి నుంచి పెద్ద పెద్ద తాటిచెట్లు తెప్పించి నిలువుకి కోసి మరో రెండు ఫ్లోర్సు నిర్మించాము. వాహినిలో తయారైన మొదటి చిత్రం 'షావుకారు' ఎల్.వి. ప్రసాద్ మాకోసం దర్శకత్వం వహించిన మొదటి చిత్రం.

1949 నవంబరు 5వ తేదీన ప్రారంభమై, 1950 మార్చి 11కి పూర్తయింది ఈ సినిమా. 1950 ఏప్రిల్ 7వ తేది 'షావుకారు' రిలీజయింది.

ఆ తరువాత మా వాహిని స్టూడియో అంచెలంచెలుగా విస్తరించి సౌత్ ఈస్టు ఏషియాలో కెల్లా పెద్ద ఫిలిం స్టూడియోగా ఖ్యాతి సంపాదించుకుంది.

**మనసుంటే మార్గముంది.**
**అసాధ్యమంటూ ఏదీ లేదు.**
**పట్టుదలతో ఏదైనా సాధించగలము.**

◆

## 10

# రంగ రంగ వైభవంగా సంబరాలు

ఆడిన మాట, వాడిన బాణం, గతించిన జీవితం, జారవిడిచిన అవకాశం - ఈ నాలుగూ తిరిగిరావు అన్నది ఆర్యోక్తి.

1952లో జరిగింది ఆ వేడుక. ఆ తరువాత అలాంటివి ఎన్నో! ఎన్నెన్నో. కాని... కాని ఆరోజు మటుకు భలే మంచి రోజుగా పసందైన రోజుగా నా జ్ఞాపకాల్లో నిలిచిపోయింది.

భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడని రోజులవి. అప్పట్లో దక్షిణ దేశంలోనే మదరాసు ప్రముఖ వర్తక కేంద్రం. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం ఈ నాలుగు భాషల చలనచిత్రాలూ మదరాసులోనే తయారయ్యేవి. విజయ-వాహిని స్టూడియోలోని ఆరేడు ఫ్లోర్లలో రోజూ షూటింగ్ జరిగేది అప్పుడు.

రోజూ వుండేవే సమస్యలు, చికాకులు. ఒకరోజైనా సరదాగా గడపాలని నిర్ణయించాం.

అందుకు నాలుగు భాషల నిర్మాతలు, కళాకారులు వుత్సాహంగా సమ్మతించారు. వెంటనే సంబరానికి తగిన యేర్పాట్లు మొదలైనాయి. వాహినిలో ఖాళీగా వున్న పది ఎకరాల స్థలంలో బ్రహ్మాండమైన వేదిక నిర్మించాం.

వరసగా స్వీట్ స్టాల్, ఐస్‌క్రీం స్టాల్ ఇలా రకరకాల స్టాల్సు ఏర్పాటుచేశాం. మేకప్‌రూం, కాస్ట్యూమ్స్ రూములు తెరిచి వుంచాము. ఒక్కొక్కరూ ఆ గదుల్లోకి వెళ్ళి వారికి నచ్చిన ఫ్యాన్సీ డ్రెస్సు వేసుకుని రావాలి. కార్నివాల్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ఇది తప్పనిసరి నిబంధన.

'రండయ్య రండి. అయిదు పెడితే పది... పదికి ఇరవై. లక్కీ బోర్డు... రండి' అని సావిత్రి అరుస్తూ వుంటే పక్కనే ఆటగాని వేషంలో గుంపు నడుమ పాచికలు విసురుతూ ఎల్.వి. ప్రసాద్. తప్పెట వాయిస్తూ పాట పాడుతూ భుజానికి నల్ల దుప్పటి వేలాడుతూ పల్లెవాని వేషంలో ఘంటసాల. బైరాగి, జాతకాల పండితుడు ఇలా రకరకాల చిత్ర విచిత్రమైన వేషధారణలో కళాకారులు. తలకి కుచ్చుల టోపీతో భుజానికి ఒక పెద్ద ట్రే తగిలించుకుని అందరికీ స్వీట్లు పంచుతూ మధ్య స్టేజి ఎక్కి తన శ్రావ్యమైన కంఠంతో పాటలు పాడి అందరినీ అలరించారు భానుమతి.

పి. పుల్లయ్య, శాంతకుమారి, హాస్యనటుడు బాలకృష్ణ, ఎస్.వి. రంగారావు, పద్మనాభం, సావిత్రి, ఎస్.వి. సహస్రనామం, టి.ఆర్. రామచంద్రన్, టి.ఎస్. బాలయ్య, కన్నాంబ, శివరావు, మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. రాజేశ్వరరావు - ఇలా ప్రతి ఒక్కరూ పాల్గొన్నారు విచిత్ర వేషధారణలో.

మా రోజుల్లో నేను పెద్ద, నువ్వు చిన్న అనే తేడాలేవీ లేవు. దర్శకుని దగ్గర్నుంచి లైట్‌బాయ్ దాకా అంతా ఒకే కుటుంబంగా వుండేవాళ్ళం. మారువేషంలో వున్న అంతమంది కళాకారుల మధ్య నేను మాత్రం యజమానిగా సంచరించడం బాగుండదని నేనూ మిలిటరీ కమాండర్ వేషం వేసుకున్నాను. నాతో పాటు నా ప్రాణమిత్రుడు చక్రపాణి మార్వాడి షావుకారు వేషం వేశాడు.

హాస్యనటుడు రేలంగి నామం పెట్టుకుని చేత ఒక చెంబు హుండీ పట్టుకుని తిరుపతి కాలినడకన వెళుతున్నట్టుగా అందరి దగ్గరా దక్షిణ సేకరించసాగాడు. అందులో అందరూ డబ్బులు వేయడంతో చెంబు నిండిపోయింది. అప్పుడు రేలంగికి నిజంగానే తిరుపతి వెళ్ళి రావాలనే కోరిక కలిగింది. ఆ డబ్బులు నిండిన చెంబుని భద్రంగా వాహిని స్టూడియోలోనే జాగ్రత్త చేసాడు. ఆ చెంబు చాన్నాళ్ళదాకా స్టూడియోలోనే వుండిపోయింది.



'విజయా కార్నివాల్'లో మార్వాడి వేషంలో చక్రపాణి,
కమాండర్‌గా నాగిరెడ్డి

ఆరోజు వేడుకల్లో లలితా, పద్మిని డాన్సు ప్రోగ్రాం కూడా చోటుచేసుకుంది. 'ఉమర్ ఖయాం' నాటకం వేశాం. ఉదయం ఎనిమిదికి ప్రారంభమైన మా కార్నివాల్ రాత్రి పదింటి దాకా సాగింది. ఏదీ ఎవరూ ముందుగా ఇలానే వెయ్యాలి అనుకోలేదు. అంతా యాదృచ్ఛికంగా జరిగిపోయింది. ఈ కార్యక్రమం గురించి విని ఎందరో నటీనటులు సాంకేతికనిపుణులు వచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రముఖ నిర్మాతలైన ఎస్.ఎస్.వాసన్, ఎ.వి. మెయ్యప్పన్ వంటి ప్రముఖులు సాయంకాలం మూడు గంటలకే విచ్చేసి చివరిదాకా వున్నారు. ఈ ఉత్సవంలో పాలుపంచుకున్న వారందరికీ శీతల పానీయాలు సప్లై చేసిన కంపెనీ ఆరోజుల్లోనే ఉచితంగా పానీయాలందించడానికి సంతోషంతో ముందుకొచ్చిందంటే చూసుకోండి మరి.

వైవిధ్యంతో కూడిన ఈ ఫంక్షన్‌కి మాకైన మొత్తం ఖర్చు పదివేలు మాత్రమే. కానీ ఈ కార్నివాల్ మాకు కలిగించిన ఆనందానికి అంతు లేదు. ఈనాడు నెలకొనివున్న మారిన పరిస్థితులలో తిరిగి అటువంటి కార్యక్రమం నిర్వహించడమన్నది కలలో కూడా వూహించలేము.

కళాకారులంతా ఒకే కుటుంబం అని నిరూపించడానికే 'విజయా కార్నివాల్'. కాని ఎవరి దిష్టి తగిలిందో మా ఐక్యతకి భంగం కలిగించే విధంగా కొన్ని సంఘటనలు జరిగాయి.

# 'విజయా కార్నివాల్'లో నాటి ప్రముఖ నటీనటులు, సాంకేతిక నిపుణులు

జోగారావు, ఎల్.వి. ప్రసాద్, సావిత్రి



లింగమూర్తి, పి. పుల్లయ్య



జోగారావు, సావిత్రి, భానుమతి, బాలకృష్ణ, శ్రీమతి బార్ట్‌లే, ఎల్.వి. ప్రసాద్, పద్మనాభం



చక్రపాణి, పింగళి నాగేంద్రరావు, ఎస్వీ. రంగారావు, కె.వి. రెడ్డి



అంజనమ్మ, బాలకృష్ణ, అంజలిదేవి, శాంతకుమారి



భానుమతి, 'భరణి' రామకృష్ణ

అవేమిటంటే -

ముడి ఫిలిం కొరత వల్ల ఫిలిం లభించడం కష్టమైంది. ఈ కారణం చేత సినిమా నిర్మాణంలోకి కొత్త నిర్మాతలు ప్రవేశించరాదని సౌతిండియన్ ఫిలిం ఛేంబర్ ఆఫ్ కామర్స్ ఒక తీర్మానం తేవడానికి ప్రయత్నించింది. నేనూ మరికొందరు నిర్మాతలు కలసి ఈ తీర్మానాన్ని వ్యతిరేకించాం. ఏ ఇండస్ట్రీలోనయినా కొత్తవాళ్ళు రావాలి. అప్పుడే నూతన ప్రయోగాలకి అవకాశముంటుంది. పరిశ్రమ వృద్ధి చెందుతుంది. మనం కూడా ఒకప్పుడు ఈ పరిశ్రమకు కొత్తవాళ్ళమే కదా! కొత్తవారికి అవకాశం కల్పించడం చిత్ర పరిశ్రమకు ఆరోగ్యప్రదం. కొత్తవాళ్ళు రావడం మానేస్తే చిత్రపరిశ్రమ కొంత కాలానికి నశించిపోయే ప్రమాదముంది అని వాదించాను. కాని నా ఈ అభిప్రాయాన్ని ప్రముఖ నిర్మాతలైన ఎస్. ఎస్. వాసన్, ఎ.వి. మెయ్యప్పన్ వంటి వారు వ్యతిరేకించారు. కాని నేను వెనుకంజ వెయ్యలేదు. కోడంబాక్కం నుంచి దక్షిణ భారతచలనచిత్ర వాణిజ్య మండలి (మౌంట్ రోడ్)కి ఒక బ్రహ్మాండమైన ఊరేగింపు కొత్త నిర్మాతల్ని కలుపుకుని సాగించాను. ఈ ఊరేగింపు ఫిలిం ఛేంబర్సులో ఒక నూతన చైతన్యం తీసుకురాగలిగింది. ఎవరెవరు మొదట్లో మమ్మల్ని వ్యతిరేకించారో వాళ్ళే మమ్మల్ని ఆహ్వానించి సపోర్టు చేశారు. బీటలువారిన మా కళాకుటుంబం మళ్ళీ ఒకటైంది.

ఇంత పలుకుబడి కలిగిన మీరెందుకు రాజకీయాల్లోకి రాకూడదు అని చాలామంది మిత్రులు నన్నడిగారు. వారందరికి నాదొక్కటే సమాధానం -

నాకు సంబంధించినంతవరకు రాజకీయ రంగం అనేది 'ఇన్స్టెంటు కాఫీ' లాంటిది. అది ఫిల్టరు కాఫీలా రుచిగా వుండదు.

కర్ణాటక రాష్ట్రం కోలార్‌లో జరిగిన అసెంబ్లి ఎన్నికల్లో కె.సి. రెడ్డి (ఆ తరువాతి కాలంలో ఆయన కేంద్ర మంత్రిగాను, రాష్ట్ర గవర్నరుగాను వున్నారు) కాంగ్రెసు తరఫున పోటీ చేశారు. ఆయన గెలుపుకి నేనెంతో శ్రమించి పాటుపడి ప్రచారం చేసాను. ఇది తెలుసుకున్న ఆనాటి ప్రధాని ఇందిరా గాంధీ మొదలుకుని ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు నాయకుడు పి.వి. నరసింహారావు దాకా చాలామంది తిరుపతిలో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ప్రచారం చెయ్యవలసిందిగా నన్ను కోరేరు. గాంధేయవాదిని గనుక తిరుపతిలో కాంగ్రెసు విజయానికి పాటుపడ్డాను. మదరాసు నుంచి కాంగ్రెసు ప్రచారానికి సంబంధించిన పాటలు కలిగిన వాహనాలు బ్యాండు మేళంతో సహా తిరుపతికి వెళ్లాయి. కాంగ్రెసు తరఫున పోటీ చేసిన చింతామోహన్ గెలిచారు. ఇది

జరిగిన మరుసటి రోజే నేను నేరుగా రాజకీయాల్లోకి రావాలని పలువురు నాయకులు నన్ను బలవంతపెట్టసాగారు. కాని నాకు మాత్రం ఇష్టం లేదు. 'కళాసేవ ద్వారా సమాజానికి ఉపయోగపడాలనుకుంటున్నాను' అని నాజూగ్గా చెప్పి తప్పించుకోగలిగాను. నేను మాత్రమే కాదు మా కుటుంబంలో ఎవరు కూడా రాజకీయాల్లోకి దిగడం నాకిష్టం లేదు.

ఒకసారి –

చెన్నైలో మా అబ్బాయిని ఎన్నికల్లో నిలబెట్టే ప్రయత్నం జరిగింది. నా అభిప్రాయాన్ని స్పష్టంగా మా అబ్బాయికి, తక్కిన కుటుంబ సభ్యులకి చెప్పాను. వారు మనస్ఫూర్తిగా నాతో ఏకీభవించారు.

ప్రత్యక్షంగా రాజకీయాల్లోకి దిగకుండా స్వచ్ఛంద సేవలు చేస్తూ సమాజ శ్రేయస్సుకి ఉపయోగపడవచ్చునని గట్టిగా నమ్ముతాను.

◆

## 11

# చక్రపాణి శకం

నీటిబిందువు మీద సూర్యకిరణం పడి పరావర్తనం చెందినప్పుడు ఏర్పడేది హరివిల్లు. ఆత్మీయత అనేది రంగుల హరివిల్లు లాంటిది. ఎన్ని రంగులున్నా అందులో కనిపించే సౌందర్యం ఒక్కటే. ప్రేమ, అనుబంధం, మైత్రి, అభిమానం, అనురాగం-ఇవన్నీ ఆత్మీయతలో లీనమై వున్నాయి. ఇతరులని నిస్వార్థంగా ప్రేమించడంలోనే ఆత్మీయత దాగుంది. నేను నీటిబిందువునయితే మా చక్రపాణి సూర్యకిరణం.

నా జీవితంలో అటువంటి ఆత్మీయత పెరిగి పెనవేసుకున్నది చక్రపాణి విషయంలో. పి. పుల్లయ్య దర్శకత్వంలో 'ధర్మపత్ని' చిత్రం తయారవుతూంది. ఆ చిత్రానికి మాటలు రాయడానికి ఒకరిని ఎన్నుకున్నారు. ఆయన రాసిన సంభాషణలు డైరెక్టరుకి తృప్తినివ్వలేదు. అప్పుడు వేరొక రచయిత కోసం వెతుకుతున్నప్పుడు ప్రొడక్షన్ ఇన్‌ఛార్జిగా వున్న బి.ఎస్.రామారావు తెనాలి వెళ్ళి చక్రపాణిని వెంట పెట్టుకొచ్చాడు.

‘ధర్మపత్ని’కి ఆయన రాసిన సంభాషణలు నచ్చడంతో 1943లో వాహినివారి ‘స్వర్గసీమ’ చిత్రానికి చక్రపాణినే సంభాషణలు వ్రాయమన్నాం. ఈ విధంగా వాహిని సంస్థకు పరిచయమైనాడు చక్రపాణి. ఆయన అసలు పేరు ఆలూరు వెంకట సుబ్బారావు.

ఆయనలోని ప్రతిభ నన్నాయనకు దగ్గరచేసి, ఇద్దరం ఆప్తమిత్రులమైనాము. తెలుగు, హిందీ, బెంగాలి మొదలైన భాషల్లో మంచి ప్రావీణ్యం కలిగినవాడు చక్రపాణి.

ఆయన బెంగాలి నేర్చుకున్న సంఘటన చాలా చిత్రమైనది. మదనపల్లిలోని ఆరోగ్యవరం శానిటోరియంలో టి.బి. చికిత్సకోసం చేరారు చక్రపాణి. అక్కడ ఆయన పక్క బెడ్‌లో వున్నతను ఒక బెంగాలి. దాదాపు మూడు నెలలు ఆయనతో స్నేహం కుదుర్చుకుని బెంగాలి ధారాళంగా రాయటం చదవటం నేర్చుకోగలిగారు చక్రపాణి. ముందే హిందీ భాష తెలిసుండటం చేత ఇది పెద్ద కష్టమనిపించలేదు ఆయనకి. తరువాత ప్రముఖ వంగ రచయిత శరత్‌చంద్రుని నవలల్ని చక్కని సరళమైన తెలుగులోకి అనువదించగలిగారు. మనసు, పట్టుదల వుండాలేగాని మనిషికి అసాధ్యమన్నది లేదు అనడానికి చక్రపాణి ఒక మంచి ఉదాహరణ.

అతని అనువాద నవలల మొదటి ముద్రణ పుస్తకాలన్నీ అమ్ముడైపోయాయి. రెండో ముద్రణ నిమిత్తం నా దగ్గరికి వచ్చాడు. అప్పటికే మేము బి.ఎన్.కె ప్రెస్సు ప్రారంభించాము. ‘యువ’ పబ్లికేషన్సు తరపున తన పుస్తకాలని ప్రచురించవలసిందిగా కోరాడు. ఆ విధంగా మా మైత్రి మరింత గాఢమైంది.

ఆ రోజుల్లో బెంగుళూరులో వాహిని చిత్రాలకి బి.ఎన్.గుప్తా డిస్ట్రిబ్యూటర్‌గా వుండేవారు. ఆయన చెన్నైలోని టి.నగర్‌లో వుండేవారు. క్రమంగా ఆయన నాకు మంచి మిత్రుడైనాడు. 1945లో గుప్త పబ్లిషర్‌గాను, నేను ప్రింటర్‌గాను చక్రపాణి సంపాదకుడుగాను ‘ఆంధ్రజ్యోతి’ అనే రాజకీయ సామాజిక చైతన్యంతో కూడిన రచనలు కలిగిన మాస పత్రిక ఆరంభించాము.

‘ఆంధ్రజ్యోతి’లో చక్రపాణి రచనలు ఎందరో పాఠకులని ఆకర్షించగలిగాయి.

1947లో ‘చందమామ’ పత్రికను ప్రారంభించిన తరువాత చక్రపాణి ‘చందమామ’కు సంపాదకత్వం వహించారు. అందుచేత ‘ఆంధ్రజ్యోతి’ సంపాదక బాధ్యతలు నేను తీసుకున్నాను.

స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపిరి పోయడానికి కొత్త పరిణామం తీసుకు రావడానికి ఎందరో ఉత్తమ రచయితలు 'ఆంధ్రజ్యోతి' పత్రికతో సహకరించారు. వాళ్ళంతా నాకు కూడ మంచి స్నేహితులయ్యారు.

టి.నగర్ విజయ రాఘవాచారి రోడ్డులో వుండే మా ఇంటితో బాటు మిగతా ఆస్తులన్నీ ఆస్తి పంపకంలో నా సోదరులకు చెందాయి. నాకు మాత్రం ఆచారప్పన్ వీధిలోని బి.ఎన్.కె.ప్రెస్సులోని ప్రింటింగు మెషిన్‌లు మాత్రమే దక్కాయి. ఈ పంపకాలకి అయిష్టం తెలిపిన చక్రపాణి, బి.ఎస్.రామారావు మా నాన్నగారిని కలిసారు.

'నాగి మంచి తెలివి తేటలు కలవాడు. ఎట్టాగయినా వృద్ధిలోకి రాగలడు. ఇది ఆలోచించే ఈ ఏర్పాటు' అని చెప్పి పంపారు ఆయన.

నేను టి.నగర్‌లో వేరే అద్దె యిల్లు చూసుకోవాల్సి వచ్చింది. దిక్కులేని వానికి దేవుడే దిక్కు అన్నట్టుగా ఆ సమయంలో నాగయ్యగారి సహాయం నాకు లభించింది. అప్పట్లో టి.నగర్ రామస్వామి వీధిలో నాగయ్యగారి ప్రొడక్షన్ కోసం ఆఫీసుండేది. ఆ అద్దె యింటిని నాకిచ్చేసారు వాడుకొమ్మని. నా మకాం అక్కడికి మారింది. చక్రపాణిగారు కూడా ఆచారప్పన్ వీధిలో వున్న మా ప్రింటింగు ప్రెస్సు మేడ మీది నుంచి టి.నగర్ రామస్వామి వీధికి మారారు. మేడమీద ప్రత్యేకంగా ఒక గది కేటాయించబడింది ఆయనకి.

పత్రికా ప్రచురణలో బిజీగా వున్న ఆయన్ని తన కుటుంబాన్ని కూడా చెన్నైకే తీసుకురమ్మని చెప్పాను. అప్పుడాయన భార్యావియోగంలో తన ఇద్దరు బిడ్డలతో నివసించేవారు. పెద్దబ్బాయి తిరుపతిరావు. మేం తిరు అని పిలిచేవాళ్ళం. రెండోవాడు సుధాకర్. ప్రస్తుతం హైదరాబాదులో వుంటున్నాడు. ఈ ఇద్దరినీ రాయపేటలో వి.ఎన్.శర్మగారు నడిపే చిల్డ్రన్స్ గార్డెన్ స్కూల్లో చేర్పించాము. కాని ఆ స్కూల్‌లో హాస్టలు వసతి లేదు.

మాకు శాశ్వతంగా దూరమైన మా ముద్దు బిడ్డలిద్దరూ బతికుంటే ఈనాడు సరిగ్గా ఇలాగే వుండేవారు. భగవంతుడే మన కోసం ఈ చిన్నారులను మన దగ్గరికి పంపాడేమో అని నాభార్యతో అన్నాను. ఇకనించి ఈ బిడ్డలకి నేనే తల్లిని అని చెప్పింది ఆమె. మా పిల్లలతోపాటు చక్రపాణి పిల్లలు కూడా నా భార్యని 'అమ్మా' అని పిలిచేవారు. చక్రపాణి గారిని పిల్లలేమైనా కోరితే 'వెళ్ళి అమ్మని అడగండి'

అనేవారాయన. అదే సమయంలో మా పిల్లలు బాబ్జి (నిర్మాత బి.వెంకట్రామిరెడ్డి), శారదల పట్ల ఎంతో వాత్సల్యంతో మెలిగేవారు చక్రపాణి. పిల్లలతో ఆడుకుంటున్నపుడు తానూ ఒక పసిపిల్లవాడుగా మారిపోయేవాడు. క్రమంగా ఆయన మాలో ఒకరుగా కలిసిపోయారు. మా యింటి మేడమీదే ఒక గది యేర్పాటు చేసి మాలో కలుపుకున్నాము. ఈనాటికీ నాగిరెడ్డి-చక్రపాణి అంటే ఒక తల్లి కడుపున పుట్టిన వారే అని అందరూ అనుకుంటున్నారంటే అందుక్కారణం మా మధ్య పెనవేసుకున్న అనుబంధమే. మా పిల్లలతో పాటు ఆయన పిల్లలు కూడా నా భార్య పక్కన పడుకునేవారు. చోటులేక నేను వరండాలో పడుకునేవాడిని.

రాత్రి ఎనిమిది దాటేక కూడా నేనింటికి తిరిగిరాలేదంటే ఆందోళన పడిపోయే వారాయన. వచ్చిన వెంటనే ఆలస్యానికి కారణం చెప్పాలి నేనాయనకి. ఆ విధంగా కంటికి రెప్పలా కాపాడుకునేవారాయన నన్ను. నన్ను గురించి ఎవరైనా తప్పుగా మాట్లాడితే (ఆఖరికి నా పిల్లలైనా సరే) సహించేవారు కాదు. కాని నేనేదైనా పొరపాటు చేస్తే మాత్రం చనువుతో నన్ను మందలించేవారు.

మొదట్లో తన పుస్తకాలు అచ్చు వేయించుకోవడానికి వచ్చి, 'ఆంధ్రజ్యోతి'కి సంపాదకుడై, ఆ తరువాత 'చందమామ'కి సారధియైనాడు. నాకు ప్రాణమిత్రుడైనాడు చక్రపాణి. మా మైత్రి పెరిగి పెరిగి మహావృక్షమై ఊడలు వేసింది. ఈ స్నేహమే తరువాతి కాలంలో మేము భాగస్తులం కావడానికి దారితీసింది. స్టూడియో నడుపుదాం అని తీర్మానించినప్పుడు అందులో ఒక షేర్ కొనుక్కున్నారు చక్రపాణి. విజయా ప్రొడక్షన్సు ప్రారంభించి మొదటి చిత్రంగా ఆయన రాసిన కథ 'షావుకారు' సినిమాగా తీసాము. ఆ సినిమాతోనే మొట్ట మొదట, 'నిర్మాతలు నాగిరెడ్డి-చక్రపాణి' అనే టైటిలు కార్డు వేశాము. అది మొదలు ఆయన పరమపదించేదాకా మేము నిర్మించిన అన్ని చిత్రాల్లోను అదే టైటిల్ వచ్చింది.

కథ, మాటలు, దర్శకత్వం, ఈ బాధ్యతలన్నీ చక్రపాణివి, నిర్మాణ వ్యవహారాల బాధ్యత మాత్రం నాది అని ఒప్పందం చేసుకున్నాము. ఆయన వ్యవహారాల్లో నేనుగాని, నా వ్యవహారాల్లో ఆయన గాని కల్పించుకున్నది లేదు.

బాధ్యతల విషయానికొస్తే చాలా ఖచ్చితంగా వ్యవహరించేవారు. ఉదాహరణకి 'మిస్సమ్మ' చిత్రానికి మొదట్లో భానుమతిని ఎంపిక చేసాము. చిత్రం రెండవ షెడ్యూలు షూటింగ్ జరుగుతూ వుంది. కథ ప్రకారం భానుమతి ఒక క్రిస్టియన్ యువతి. ఎన్.టి.రామారావేమో హిందు యువకుడు. ఉద్యోగ నిమిత్తం వీరిద్దరూ

చక్రపాణి

భార్యా భర్తలమని అసత్యమాడి నటించాలి. ఈ షూటింగు సమయంలో భానుమతికి, చక్రపాణిగారికి అభిప్రాయ భేదం వచ్చింది. ఇంతకీ ఇద్దరూ కూడా రచయితలే. 'ధర్మపత్ని' సినిమా వచ్చినప్పట్నించి వీరిద్దరూ మంచి సాహితీ మిత్రులు. అయినా చక్రపాణి క్రమశిక్షణకి పెట్టింది పేరు. చక్రపాణి, భానుమతిని పిలిచి 'ఇక నీతో సినిమా తీయడం వీలుపడదు' అని చెప్పి ముందుగా అనుకున్న డబ్బులు ఆమెకిచ్చేసి

వెళ్ళిపొమ్మన్నారు. ఆ తరువాత అప్పట్లో సెకెండ్ హీరోయిన్ వేషాలు వేస్తున్న సావిత్రిని హీరోయిన్‌గా పెట్టి 'మిస్సమ్మ' చిత్రం పూర్తి చేసారు. అంతటి పట్టుదలగల మనిషి మా చక్రపాణి. ఇలాగే 'రామ్ ఔర్ శ్యామ్' (తెలుగులో 'రాముడు-భీముడు') చిత్రానికి ఆనాటి ప్రముఖ హీరోయిన్‌ని ఎన్నుకున్నాము. కాని షూటింగు సమయంలో పెద్ద గొడవ జరిగింది. అప్పుడు ఆ సినిమాలో రెండో హీరోయిన్‌గా వేసే వహిదా రెహమాన్ మొదటి హీరోయిన్‌గా వేయాల్సి వచ్చింది. ఆ సందర్భంగా తలెత్తిన సమస్యల్ని విజయవంతంగా పరిష్కరించడానికి నాకెంతో తోడ్పడినవారు అనంతనారాయణన్, అడ్వకేటు ఎన్.సి.రాఘవాచారి, ఏ.ఎల్.శ్రీనివాసన్ లాంటి ప్రముఖులే. అన్నిటిని మించి చక్రపాణి నాతో వున్నాడనే ధైర్యం, ఆయన ప్రోత్సాహం ప్రధాన కారణం. ఇలా ఎన్నయినా చెప్పుకుంటూపోగలను.

ఈరోజు 'చందమామ' ప్రపంచ ఖ్యాతిని సంపాదించుకున్న పత్రికగా వెలుగొందుతున్నది. పన్నెండు భాషల్లో వెలువడుతున్న మాస పత్రిక ఇదొక్కటే. ఆరేళ్ళ పసివాడు మొదలుకుని అరవైయేళ్ళ పెద్దవారి దాకా అంతా అసక్తిగా చదివి ఆనందించే పత్రిక ఇదొక్కటేనంటే అందుకు గట్టి పునాదులు వేసింది చక్రపాణి గారే!

నూట నాలుగు డిగ్రీల జ్వరంతో పడుకుని వున్నా సరే ఆయన సంతకం లేనిదే 'చందమామ'లో ఒక్క అక్షరం ముక్క కూడా అచ్చుకాదు. పత్రిక విలువల విషయంలో అంతటి శ్రద్ధ తీసుకునేవారు. 'పిల్లల పత్రిక అయినా పెద్దవారికి కూడా చందమామ కథల్లో చక్కని సందేశం వుండి 'తీరాలి. కాని ఏ ఇజానికి కట్టుబడి వుండరాదు', అనేవారాయన. చందమామకి వచ్చే కథల్ని తిరగ రాయమనేవారు. అవసరమైతే తనే తిరగరాసేవారు. చిత్ర నిర్మాణం, పత్రికా నిర్వహణ ఈ రెంటిలోనూ ఆయన సేవ మరువరానిది.

ఉదయం వేళలో స్టూడియో, మధ్యాహ్నం రెండు గంటల పాటు పత్రిక వ్యవహారాలు, మళ్ళీ స్టూడియో, సాయంకాలం ఏడుగంటల పైన మళ్ళీ పత్రిక-ఇదీ ఆయన దినచర్య. సినిమా విషయంలో తననొక సగటు ప్రేక్షకునిగా భావించుకునేవారు. అలాగే 'చందమామ' విషయంలో సగటు పాఠకునిగా వూహించుకునేవారు. జనానికి ఇది నచ్చుతుంది ఇది నచ్చదు అని చెప్పగల సూక్ష్మగ్రాహి ఆయన. ఇంతటి సూక్ష్మ దృష్టి కలిగుండి కూడా మేము నిర్మించిన 'చంద్రహారం' బాక్సాఫీసు దగ్గర ఫెయిలైంది.

'పాతాళభైరవి' తరువాత అంత బ్రహ్మాండంగాను తీయాలని తీసిన సినిమా 'చంద్రహారం'. ఎన్.టి.రామారావు, ఎస్.వి.రంగారావు, శ్రీరంజని, సావిత్రి

మొదలైనవారంతా నటించడం చేత ఘనవిజయం సాధిస్తుందనుకున్నాం. అందుకు తగినట్టు మంచి పబ్లిసిటి ఇచ్చాం. ఆంధ్రలోని అన్ని కేంద్రాల్లోను విడుదల చేశాం. నెల్లూరులో వుండే మా మామగారి శేష్‌మహల్ థియేటర్‌లో విడుదలైంది సినిమా. పెద్ద సంఖ్యలో జనం వస్తారనే నమ్మకంతో ఆ సాయంకాలం ఆటకు నేను, చక్రపాణి ముందుగానే వెళ్ళి హాల్లో కూర్చున్నాము. ఇంటర్వెల్‌లో మమ్మల్ని గుర్తుపట్టిన కొందరు కుర్రాళ్ళు మా దగ్గరికొచ్చి 'ఇకమీదటైనా అసలు కథ వస్తుందంటారా? హీరో ఇకనైనా నిద్రలేస్తాడా?' అన్నారు. అంతే! మా నమ్మకం నీరుగారి పోయింది.

మామగారింటిక్కూడా వెళ్ళకుండా నేరుగా కారులో మద్రాసు బయలుదేరాం. ఇల్లు చేరేదాకా మేమెవరం మాట్లాడుకోలేదు. కారు దిగగానే చక్రపాణిని టైమెంతని అడిగాను. 'రెండున్నర' అని చెప్పారు.

వెంటనే వెళ్ళి పడుకున్నాము. మర్నాడు నిద్రలేచింతరువాత ఆ సినిమా గురించి సమీక్ష జరిపాము. 'చంద్రహారం' సినిమా పూర్తయిన వెంటనే చూసిన ఇండస్ట్రీ వాళ్ళంతా సినిమా సూపర్‌హిట్ అవుతుందని చెప్పారే, కాని ఎందుకిలా జరిగింది? అని చర్చించాము. సినిమాలోని లోటుపాట్ల గురించి ఒక సగటు ప్రేక్షకుని దృష్టితో విమర్శ చేసుకున్నాం. చివర్న ఒక నిర్ణయానికి రాగలిగాము .దానిని అమలు చేశాం. ఆ తరువాత మేం తీసిన సినిమాలన్నీ విజయాలే. సినిమా నిర్మాతలకి, దర్శకులకి మాత్రం బాగుండటం కాదు. అది జనరంజకంగా వుండాలి. ప్రేక్షకులను ఆహ్లాదపరిచే సన్నివేశాలతో నమ్మదగిన కథనంతో కూడినదై వుండాలి అనే విషయాలు గ్రహించ గలిగాము.

చక్కని కథ, మంచి సందేశంతో కూడి, కుటుంబమంతా కూర్చుని చూసి ఆనందించే జనరంజకమైన చిత్రాలు నిర్మించడానికి పూనుకున్నాము.

స్క్రీన్‌ప్లే రాయడం పూర్తి చేసి మా పెద్దమ్మాయి జయ చేతికిచ్చి చదవమని చెప్పేవారు చక్రపాణి. మా పిల్లల అభిప్రాయాన్ని శ్రద్ధగా వినేవారు. వారి సూచనల మేరకు అవసరమైన చోట్ల కథలో మార్పులు చేర్పులు చేసేవారు. వయసుతో నిమిత్తం లేకుండా యితరుల అభిప్రాయాలకి విలువనివ్వటం ఆయనలోని ప్రత్యేకత. సంభాషణలు క్లుప్తంగా సమయోచితంగా సందర్భానుసారంగా వుండాలని అనేవారు. ఇలా సినిమా నిర్మాణానికి సంబంధించిన అన్ని విషయాల్లోను నిర్దిష్టమైన అభిప్రాయాలు కలిగి వుండేవారు.

ఆంధ్ర రాష్ట్రంలోని రెడ్డి, కమ్మ అనే కులాలు బలమైన వర్గానికి చెందినవి. మా లాగే (నేను రెడ్డి, చక్రపాణి కమ్మ) ఈ రెండు కులాల వారినీ దగ్గరకు తేవాలని కోరుకున్నాం. అందుచేత ఎన్.టి.రామారావు, ఎ.నాగేశ్వరరావు గార్లని రెడ్డి, కమ్మ కులాలకి చెందిన పాత్రలుగా చిత్రిస్తూ 'మనుషులు మారాలి' అనే చిత్రం తీయాలని సంకల్పించాము. కాని చిత్ర నిర్మాణానికి ముందే చక్రపాణి అకాల మరణం చెందారు. ఆయన లేకుండా ఆ సినిమా తీయడానికి నాకు మనస్కరించలేదు. మా ఇద్దరిని మరణం మాత్రమే విడదీయగలిగింది. మా విజయా ఆసుపత్రిలోనే ఆయన పరమపదించారు.

ఈరోజు నేనింతటి వాణ్ని కాగలిగానంటే అందుకు ముఖ్య కారకుడు చక్రపాణి!

నాకు ఆప్తమిత్రునిగా, సోదరునిగా, మార్గదర్శిగా, గురువుగా వుంటూ ఒక శకాన్ని సృష్టించి తను తనువు చాలించినా మా చక్రపాణి నాలో యింకా జీవించే వున్నాడు.

◆

# విజయా బేనర్‌లో తయారైన సినిమాలు



షావుకారు (1950)



పాతాళభైరవి (1951)

కళ్యాణం పణ్ణి పార్
తమిళం (1952)



పెళ్ళి చేసి చూడు
(1952)

'చంద్రహారం' - తెలుగు, తమిళం (1954)

మిస్సమ్మ (1955)

మిస్సియమ్మ - తమిళం (1955)

గుణసుందరి - తమిళం (1955)

మాయాబజార్ - తెలుగు (1957)

మాయాబజార్ - తమిళం (1957)



అప్పు చేసి పప్పుకూడు (1958)



కడన్ వాంగి కల్యాణం - తమిళం (1958)

జగదేకవీరుని కథ (1961)



గుండమ్మ కథ (1962)

మనిదన్ మారవిల్లై - తమిళం (1962)

మదువే మాడి నోడు - కన్నడం (1963)

సత్య హరిశ్చంద్ర - కన్నడం (1965)

సత్య హరిశ్చంద్ర - తెలుగు (1965)

సి.ఐ.డి.
(1965)



ఎంగ వీట్టు పిళ్లై
తమిళం
(1965)

ఎంగ వీట్టు పెణ్
తమిళం
(1965)

ఉమా చండీ గౌరీ
శంకరుల కథ
(1968)



నమ్ నాడు - తమిళం (1969)

గంగ - మంగ (1973)



వాణి - రాణి - తమిళం (1973)



శ్రీ రాజరాజేశ్వరి విలాస్ కాఫీ క్లబ్ (1976)



జ
విజయ
(1994)

మీండుం సావిత్రి - తమిళం
(1996)

నేటి సావిత్రి - తెలుగు
(1996)

# విజయా బేనర్‌లో తయారైన హిందీ సినిమాలు

రామ్ ఔర్ శ్యామ్ (Ram Aur Shyam) 1967

నన్హా ఫరిష్తా (Nanha Farishta) 1969



ఘర్ ఘర్ కీ కహాని (Ghar Ghar ki Kahani) 1971



జూలి
(Julie) 1975

యహి హై జిందగీ (Yahi Hai Zindagi) 1977



స్వర్గ్ నరక్
(Swarg Narak)
1978



స్వయంవర్ (Swayamvar) 1980



శ్రీమాన్ శ్రీమతి (Shriman Shrimathi) 1982

'మీండుం సావిత్రి' (తమిళం) సినిమా ప్రారంభోత్సవంలో
శ్రీమతి శేషమ్మ జ్యోతి ప్రజ్వలనం చేస్తూ,
దర్శకుడు విసు, ప్రక్కనే నాగిరెడ్డి



'ఎంగవీట్టు పెణ్' టి.వి. సీరియల్ ప్రారంభోత్సవ సమయంలో,
నిర్మాత బి. విశ్వనాథరెడ్డి, కథారచయిత బి. నాగిరెడ్డి,
దర్శకుడు వి.కె.ఆర్. రఘు

'ఎంగ వీట్టు పెణ్' ('షావుకారు') షూటింగులో
దర్శకునిగా బి. నాగిరెడ్డి



## 12

# 'మార్గదర్శి' ఎస్.ఎస్. వాసన్

చెన్నైలో విజయా హాస్పిటల్ ప్రారంభించిన వేళ...ఆసియా, ఆఫ్రికా దేశాల కంటి వైద్యుల మహానాడు అక్కడ ఏర్పాటైంది. ప్రముఖ వైద్య నిపుణులంతా పాల్గొన్నారందులో. వారిలో అమెరికన్ వైద్య నిపుణుడొకాయన నా కళ్ళని పరీక్షించి అమెరికా వచ్చి చికిత్స చేయించుకోవలసిందిగా ఆహ్వానించాడు.

ఆ ప్రకారమే అమెరికా వెళ్ళాను. చికిత్స పూర్తయిన తరువాత స్వదేశం తిరిగొస్తూ ఐరోపాలోని ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ దేశాల్లోని చారిత్రక ప్రసిద్ధి గాంచిన యాత్రా స్థలాలని సందర్శించాలని సంకల్పించాను. మొదట జర్మనీ వెళ్ళాను. ఫ్రాంక్‌ఫర్ట్ నగరంలో విమానం దిగి హోటల్ గదికి చేరిన వెంటనే ఇండియా నుంచి ఒక సమాచారం అందింది. జెమిని సంస్థని మూసివేశారు అని. నమ్మలేక పోయాను! పత్రికారంగంలోగాని, సినిమా రంగంలో గాని నావంటి వాళ్ళెందరికో ఆదర్శంగా వుండే సంస్థ జెమిని. జర్మనీలో నా యాత్ర కొనసాగించడానికి నాకు మనస్కరించలేదు. నేనే ఏదో కోల్పోయినట్టుగా మనసులో బాధ. ఇదెలా సంభవించింది. దీన్ని మనం

ఏవిధంగానయినా ఆపగలమా అని ఆలోచించి నా యాత్రని రద్దు చేసుకుని స్వదేశానికి ప్రయాణమయ్యాను. విమానం గాల్లోకి లేచింది. నా జ్ఞాపకాలు వాసన్ కేసి వెనక్కి పరుగులు తీసాయి.

ఎస్.ఎస్.వాసన్ ఒక సామాన్యమైన వ్యక్తిగా జన్మించి అంచెలంచెలుగా ఎదిగి 'జెమిని' అనే ఒక మహా సంస్థని స్థాపించగలిగారు.

అఖండ విజయం సాధించిన విజయావారి 'పాతాళ భైరవి' చిత్రంలోని కొన్ని నృత్య దృశ్యాలని రంగుల్లోకి మార్చి హిందీలో విడుదల చేసింది జెమిని సంస్థే. 'నాగి...నాగి' అంటూ ఎంతో అభిమానంతో నన్ను సంబోధించే వాసన్‌తో నా స్నేహం అలా మొదలైంది. ఆ తరువాత వాహినీలో సినిమా నిర్మాణానికి సంబంధించిన అన్ని వేడుకల్లో ఎంతో వుత్సాహంగా పాల్గొనేవారాయన. అందరికీ ఎంతో ప్రోత్సాహం యిచ్చేవారు.

మా అన్న బి.యన్.రెడ్డి వాహిని బేనర్ మీద 'సుమంగళి' చిత్రం తీస్తున్న సమయం. ఈ సినిమా పబ్లిసిటీ విషయంలో నేను చేసిన కొన్ని నూతన ప్రయోగాలు గురించి విని, 'పబ్లిసిటీ కోసం నేనెంతో డబ్బు తగలేస్తున్నాను. కాని నువ్వు అతి తక్కువ ఖర్చుతో మంచి పబ్లిసిటీ సంపాయిస్తున్నావు. భేష్' అని నా భుజం తట్టాడు వాసన్. 'సుమంగళి' చిత్రాన్ని తమిళంలో నిర్మించి విడుదల చేయడానికి మాదగ్గర హక్కులు కొన్నారాయన.

బెంగుళూరులో నా 'భక్తపోతన' కటవుట్‌ని చూసి 'పబ్లిసిటీ కోసం నేనెంతో ధారపోస్తుంటే ఒకే ఒక్క కటవుట్‌తో నన్ను మించి పోయావయ్యా నాగి' అని మనసారా ప్రశంసించారని చెప్పానుగా. తనని మించిన విజయాలు సాధించిన వారిని సైతం నిస్సంకోచంగా మెచ్చుకోగల ఆయన సంస్కారం మహోన్నతమైనది. ఆయనలోని ఈ మంచి గుణాల చేతనే అందరికి అభిమాన పాత్రుడు కాగలిగాడు. వ్యక్తిలో దాగివుండే శక్తిని పైకి తేవాలి అనే వాడాయన తరచుగా.

తమిళ రచయిత బి.ఎస్.రామయ్య ఎంత స్వేచ్ఛగా రచనలు చేస్తాడో వ్యక్తిగా కూడా అంత స్వేచ్ఛా ప్రియుడు. వాసన్‌గారికి మంచి మిత్రుడు. బి.ఎస్. రామయ్య వుద్యోగం వదిలేసిన రోజులవి.

ప్రముఖ హిందీ చిత్ర నిర్మాత మెహబూబ్‌ఖాన్ 'ఆన్' హిందీ చిత్రం నిర్మిస్తున్నారు. ఆ చిత్రాన్ని తమిళంలో కూడా విడుదల చేయాలని సంకల్పించారు ఖాన్. వాసన్‌కి మంచి మిత్రులు కూడా ఆయన. మెహబూబ్ మదరాసు వచ్చి వాసన్‌ని కలిశారు.

అప్పుడు రచయిత రామయ్య పురసైవాకంలో ఒక మేడమీది గదిలో వుండేవారు. ఆయనింటికి ఫోన్ చేసి వెళ్ళారు వాసన్. తన యింటి ముందు అతి ఖరీదైన కారులోంచి దిగిన వాసన్‌ని చూడగానే ఒంటిమీది తువ్వాలు తోనే కిందికి దిగివచ్చాడు రామయ్య 'నిన్ను కలవడానికి బొంబాయి నుంచి మెహబూబ్‌ఖాన్ అనే ఒక పెద్ద ప్రొడ్యూసర్‌ని పిలుచుకొచ్చాను. ఆయన 'ఆన్' అనే ఒక మంచి హిందీ సినిమా తీశారు. దాన్ని తమిళంలో కూడా తీయాలనుకుంటున్నారు. ఈ పనిమీద నువ్వు వచ్చే వారమే ఆయనతో లండన్ వెళ్ళాలి. తమిళంలో రచన చేయడానికి నీకు 60 వేల రూపాయలు పారితోషికం యిస్తారు", అని చెప్పారు వాసన్. అది వినగానే రామయ్యకి సంతోషంతో నోటమాట రాలేదు. ఆ క్షణంలో రామయ్య దగ్గర చిల్లిగవ్వ లేదు. వెంటనే పదివేలు అడ్వాన్సుగా యిచ్చాడు వాసన్.

యాభై సంవత్సరాల క్రితం 60 వేల రూపాయలంటే సామాన్య విషయం కాదు. వాసన్‌గారి సహృదయతని ఏమని పొగడాలి!

ఈ హిందీ చిత్ర నిర్మాత మెహబూబ్‌ఖాన్ తరువాత నాకూ మంచి మిత్రుడయినాడు.

మన దక్షిణ దేశ చిత్రాలకి ఉత్తర భారతంలో మార్కెట్ ప్రారంభమైంది 'చంద్రలేఖ' సినిమాతోనే. హిందీ నటులెవరూ లేరు ఆ చిత్రంలో. తమిళనటుల గురించి అప్పట్లో హిందీ ప్రేక్షకులకి ఎక్కువ పరిచయం లేదు. సుమారు 7 లక్షల రూపాయలు ఖర్చయింది, ఆ సినిమా పబ్లిసిటికి మాత్రం. చిత్రం రిలీజై ఆ రోజుల్లోనే రెండు కోట్ల రూపాయలు వసూలు చేసింది. ఇండియాలోనే పెద్ద మొత్తం వసూలు చేసిన చిత్రంగా ప్రసిద్ధి చెందింది.

ఈ అద్భుతమైన సాధన వాసన్‌కి మాత్రమే కాదు దక్షిణ భారత చలన చిత్ర రంగానికే తలమానికమైంది. అందరూ బాగుండాలనేది వాసన్ సిద్ధాంతం.

హిందీ చిత్ర నిర్మాణ రంగంలో వచ్చేలాభం, కీర్తి తన సహ నిర్మాతలకి చెప్పి వారిని కూడా హిందీ చిత్రాలు నిర్మించమని సలహా యిచ్చేవారు వాసన్. ఆయన్ని అనుసరించి ఎ.వి.యం సంస్థ హిందీ చిత్ర నిర్మాణానికి పూనుకుంది. ఆ తరువాత వరుసగా పక్షిరాజా పిక్చర్సు శ్రీరాములునాయుడు, వీనస్ పిక్చర్స్, చిత్రాలయ, చివరగా మా విజయా ప్రొడక్షన్స్ హిందీ చిత్రాల్లోకి దిగాయి.

నాకేవైనా సమస్యలొచ్చినప్పుడు వాసన్‌గారి దగ్గరి కెళ్ళి సలహా కోరడం నాకు అలవాటు. అప్పుడాయన కనుబొమలు చిట్లించి, కనులు మూసి రెండు వేళ్ళు ముక్కు కొసకి ఆనించి 'నాగి' అని ప్రారంభించి నా సమస్యకి చక్కని పరిష్కారం సూచించేవారు.

బి. నాగిరెడ్డి, ఎస్.ఎస్. వాసన్, రాజాజీ



ఎస్.ఎస్. వాసన్, మెహబూబ్‌ఖాన్, బి. నాగిరెడ్డి

జెమిని చిత్రాలను జెమిని సంస్థే విడుదల చేసేది. ఎక్కువ సంఖ్యలో ప్రజలు తన చిత్రాలు చూడాలని ఆశించేవారాయన. నిజాయితీతో, చిత్తశుద్ధితో శ్రమించాలన్నది ఆయన సిద్ధాంతం.

వాసన్‌కి తన వృత్తే ప్రవృత్తి కూడా. సినీ నిర్మాణంలో మంచి విలువలు, ప్రయోగాలు సాధించడం ఆయనకి అపరిమితమైన ఆనందాన్నిచ్చే విషయాలు.

పత్రికా రంగంలోను, సినిమా రంగంలోను వాసన్ నాకు ఆదర్శపురుషుడు. మొదట 'ఆనందవికటన్' అనే తమిళ పత్రిక ప్రారంభించి, క్రమంగా అభివృద్ధి చెంది, సినిమా రంగంలో ప్రవేశించి 'జెమిని' అనే మహా సంస్థని స్థాపించిన ఘనత వాసన్‌ది. ఆయన్ని ఆదర్శంగా తీసుకుని 'ఆంధ్రజ్యోతి' అనే సకుటుంబ పత్రిక ప్రారంభించి తరువాత 'విజయా' సంస్థని స్థాపించాను. 'చందమామ' పత్రికని పలు దేశ భాషల్లో ప్రచురించాను. వాసన్‌గారితో నా అనుభవాలు, అనుభూతులు నా స్మృతిపథంలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

ఈ జ్ఞాపకాలతో బొంబాయి విమానాశ్రయం నుంచి బైటికొచ్చాను. జెమిని ప్రస్తుత పరిస్థితి గురించి తెలుసుకున్నాను.

'జెమినిని ఒక రియల్ ఎస్టేట్ కంపెని వారికి విక్రయించారు. అక్కడ ముంబాయిలో వలె ఒక బిల్డింగ్ కాంప్లెక్స్ రాబోతూవుంది' అని చెప్పారు. నమ్మలేకపోయాను. ఈ సమాచారం నన్ను కలవరపెట్టింది.

చెన్నై వచ్చాను. జెమిని స్టూడియోని పగల గొడుతున్నారని తెలిసింది. ఆలోగా ఒకసారి వెళ్ళి చూసిరావాలనిపించింది. వెంటనే బైలుదేరాను. 'మూవీలాండ్' అనే జెమిని భవనంలోకి ప్రవేశించాను. వాసన్‌గారి ఆఫీసులో అడుగుపెట్టాను. నా కనులు చెమర్చాయి. ప్రశస్తి చెందిన జెమిని మర్రిచెట్టు కిందికెళ్ళి నిలుచున్నాను. చుట్టూ పరికించాను. అప్పుడు గీతలో కృష్ణ భగవానుని వాక్యాలు మదిలో మెదిలినాయి–

**'ఈనాడు నీవు నీ సొంతమనుకున్నదంతా, నిన్న మరొకరి సొంతం కదా,**
**మరి రేపు ఇంకొకరిదవుతుంది.**
**ఇది లోకరీతి.'**

◆

ఎన్.టి. రామారావుతో నాగిరెడ్డి



## 13

# ‘నాన్నగారూ’ అని పిలిచే ఎన్.టి.ఆర్.

నా మటుకు నన్ను గత పదేళ్లలో బాగా ‘షాక్’కి గురి చేసిన విషయాలు రెండు.

ఒకటి ‘ఎం.జి.ఆర్’ గారి మృతి. రెండోది ఇటీవల ఎన్.టి.ఆర్. మరణం.

ఎన్.టి.ఆర్. గారు ఏనాడూ నన్ను ‘రెడ్డిగారు’ అని పిలిచినవారు కాదు. ఎప్పుడూ ‘ఫాదర్’ అనే సంబోధిస్తుంటారు. అతనికి సంబంధించినంతవరకు ‘విజయా పిక్చర్స్’ మాతృ సంస్థ.... కారణం – ఆయన సినీ ప్రస్థానం మొదలయ్యింది, నిలదొక్కుకుందీ ఆ సంస్థ ద్వారానే.

‘షావుకారు’ చిత్రంలో నటించింది మొదలు ఆయన నెలసరి వేతనం ఐదు వందల రూపాయలు. ఆ తరువాత ‘పాతాళభైరవి’ చిత్రంలో హీరోగా నటింపజేసాం.

ఆయన సన్నగా ఉన్నందువల్ల వ్యాయామం చేసి ఒళ్లు పెంచమని సలహా ఇచ్చాం. ఓరోజైతే తడబడుతూ బిడియంగా నా ముందు వచ్చి నిల్చున్నారు.

'కంపెనీలో పెడుతున్న ఇడ్లీలు నాకు సరిపోవడం లేదు. మరో రెండు ఇడ్లీలు అదనంగా ఇవ్వమని చెబితే బాగుంటుంది. వ్యాయామం చేస్తున్నందువల్ల బాగా ఆకలేస్తోంది' అంటూ చెప్పలేక చెప్పారు.

'మీకు ఏం కావాలన్నా అడిగి తీసుకోండి' అన్నాను.

ఆ సమయంలో ఎన్.టి.ఆర్. గారి ముఖంలో కనిపించిన ఆనందం ఇప్పటికీ నా కళ్ల ముందు కదలాడుతూనే ఉంటుంది.

ప్రతీ విషయాన్ని చిత్తశుద్ధితో చేయాలన్న ఉద్దేశంతో పనిచేసేవారు. ఆయన కేవలం నటుడుగా మాత్రమే నాతో మెలగలేదు. మా కుటుంబానికి అత్యంత సన్నిహితుడుగా కూడా మెలిగారు.

అన్ని కేంద్రాల్లో శతదినోత్సవం జరుపుకున్న సందర్భంగా 'పాతాళ భైరవి'కి పనిచేసిన ముఖ్యమైన కళాకారులకు కార్లను బహుమతిగా ఇచ్చాము. బ్యూక్ కార్ – దాని ఖరీదు అప్పట్లో ఆరు వేల రూపాయలు. ఆ కారు చాలా కాలం పాటు పదిలంగా దాచుకున్నారు ఎన్.టి.ఆర్.గారు. 'ఫాదర్ ఇచ్చిన కారు' అని గొప్పగా చెప్పుకునేవారు.

మా కాంట్రాక్ట్ ముగిసి, 'వేరే కంపెనీల చిత్రాలలో మీరు నటించవచ్చు' అని చెప్పగానే... "నాదగ్గర కాల్‌షీట్‌కు ఎవరు వచ్చినా విజయా పిక్చర్స్‌లో నటించడానికి పిలిస్తే వెంటనే వెళ్లిపోతాను అన్న షరతు మీద ఒప్పుకుంటానండీ", అన్నారు. అలానే చేశారు కూడా.

మా సంస్థ తరఫున 20 చిత్రాలలో నటించారు. అందులో పలు విధాలైన పాత్రలు ధరించారు. ఇక వేంకటేశ్వరుడు, కర్ణుడు, రాముడు, కృష్ణుడు... ఇలా పౌరాణిక పాత్రలకు సరిగ్గా సరిపోయే నటుడు దేశంలోనే రామారావుగారు మాత్రమే. అందువల్ల ప్రజల మనసుల్లో ఆయన చెరగని ముద్ర వేసుకున్నారు.

'మాయాబజార్' చిత్రం విడుదలైనప్పుడు అందులో ఎన్.టి.ఆర్. నటించిన కృష్ణుడి వేషాన్ని సుమారు 40,000 క్యాలండర్‌లు ముద్రించి అమ్మకం చేశాము. వాటిని ఫ్రేమ్‌లు వేయించుకుని ఆంధ్రా అంతటా ఇళ్లల్లోనూ, వాణిజ్య సంస్థల్లోనూ ఉంచుకున్నారు. కొన్నిచోట్లయితే ఆ ఫోటోకు పూజలు కూడా చేసేవారని చెప్పగా విన్నాను. అంతగా ఆయన ప్రజల మనస్సులో ఆ పాత్రలో నిలిచిపోయారు.

ఆయన మంచి వక్త. తను నటించిన చిత్రాల్లోని డైలాగులు ఆయనకు కంఠతా వచ్చు. ఆ డైలాగులు ఆయన కోసమే అన్నట్లు కుదిరేవి. వాటిని కావలసిన చోట ప్రజల మధ్య ఆయన వాడుకునేవారు.

ఆయన అర్హతకు ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి మాత్రమే కాదు...భారత ప్రధానిగా కూడా అయ్యుండవచ్చు. అంతటి చిత్తశుద్ధి గలవారు.

నా కుమారులు నిర్మించగా, ఎన్.టి.ఆర్. కుమారుడు బాలకృష్ణ నటించిన 'భైరవద్వీపం' చిత్ర పూజా కార్యక్రమానికి విచ్చేసిన ఆయన, తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు. ఆ సమయంలో 'మీరు కూడా ఇందులో నటించవచ్చు కదా?' అని అడిగినందుకు "నాన్నగారు చిత్రం తీస్తే నేను తప్పక నటిస్తా", అన్నారు. నామీద అంతటి ప్రేమ, అభిమానం ఆయనకి.

మా కుటుంబ సభ్యులు ఎవరైనా సరే ఆయనను కలుసుకోవడానికి వెళితే, వారిని అడిగే మొదటి ప్రశ్న ఇదే – 'నాన్నగారు బాగున్నారా?'

ఆయన చెన్నైకి వచ్చారంటే నన్ను కలుసుకోనిదే వెళ్లరు. కనీసం టెలిఫోన్‌లోనైనా మాట్లాడాల్సిందే.

చెన్నై అంటే ఆయనకు వల్లమాలిన ప్రేమ – కృష్ణా జలాలను చెన్నైకు తీసుకురావడానికి ఆయన పడిన తాపత్రయం ఇందుకు మంచి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

తాను పదవిలో వుండగా శ్రీకారం చుట్టిన ఆ పథకాన్ని పదవిలో లేనప్పుడు సైతం నెరవేర్చడానికి కృషి చేశారు.

ఎం.జి.ఆర్, ఎన్.టి.ఆర్‌ల మధ్య ఉన్న అవినాభావ సంబంధాలను ఈ సందర్భంగా చెప్పాలని అనుకుంటున్నాను.

ఐశ్వర్యం, పదవి, అధికారం – ఈ మూడూ కలిసి వచ్చాయంటే అహంకారం కూడా వాటి వెంటే వచ్చేస్తుంది. అయితే ఎమ్.జి.ఆర్, ఎన్.టి.ఆర్.లను ఆ మూడూ వెతుక్కుంటూ వచ్చినా, వారు మాత్రం నమ్రతగానే ఉన్నారు. ప్రజలను కలుసుకోడానికి వారు ఏనాడూ వెనుకాడేవారు కాదు. ప్రజలను ఎంతగానో ప్రేమించేవారు. అందువల్లే ఆ ఇద్దరి మరణ వార్త విన్నప్పుడు అటు ఆంధ్ర, ఇటు తమిళనాడూ శోకసంద్రంలో మునిగిపోయాయి. ప్రజలు వారిపై పెట్టుకున్న ప్రేమాభిమానాలను వారు మరణించినప్పుడు మనం ప్రత్యక్షంగా చూడగలిగాము.

ఎం.జి.ఆర్, ఎన్.టి.ఆర్‌ల గురించి చెప్పాలంటే ఎన్నో విషయాలు, సంఘటనలు ఉన్నాయి. అయితే అవేవీ పంచుకోలేని విధంగా నన్ను ఒంటరివాణ్ణి చేసి వారు వెళ్లిపోయారు... గతాన్ని మరువలేకపోతున్నాను.

సుమారు 20 సంవత్సరాల సుదీర్ఘ విరామం తరువాత 'విజయా' తరపున నేను నిర్మిస్తున్న 'నేటి సావిత్రి'ని ఎన్.టి.ఆర్. గారికి, దాని తమిళ వర్షన్ 'మీన్‌డుం సావిత్రి'ని ఎం.జి.ఆర్. గారికి సమర్పిస్తున్నాను.

ఎందుకంటే వారిద్దరూ బ్రతికుంటే ఈ చిత్రాన్ని చూసి నన్ను ఎంతగానో అభినందించేవారు. 84 ఏళ్ల – ఈ ముదుసలి వయస్సులో వారి రుణం ఈవిధంగా తీర్చుకోగలుగుతున్నాను.

◆

## 14

# ఎం.జి.ఆర్. మెమోరియల్

పెద్దల ఎడల ఎం.జి.రామచంద్రన్ చూపిన గౌరవం, సినిమా రంగంపట్ల ఆయనకున్న శ్రద్ధాసక్తులు, రాజకీయాల్లో ఆయన కనపరచిన శక్తి సామర్థ్యాలు-ఇవన్నీ ఆయన్ని ఉన్నత శిఖరాలకి తీసుకు వెళ్ళాయి.

సినిమాకోసం పార్టీని వదులుకుంటారా, లేక పార్టీ కొరకు సినిమాని వొదులుకుంటారా అని ఒకసారెవరో ఆయన్ని ప్రశ్నించగా "నేను నమ్మిన ఆశయాల కోసం నా జీవితాన్నే త్యాగం చేస్తాను", అని సమాధానం యిచ్చారాయన.

'తాయ్‌క్కు పిన్ తారం' అనే సినిమాలో ఆయన నటిస్తున్నపుడు పరిచయమయ్యారు ఎం.జి.ఆర్. అది మొదలు మా మైత్రి పెరుగుతూ వచ్చింది. వటవృక్షమై నిలిచింది.

షూటింగు రోజుల్లో మధ్యాహ్న భోజన సమయంలో తనతో కూర్చుని భోంచెయ్యమని ఆహ్వానించేవారు. నా భోజనం అయిందని చెప్పిన తరువాతే ఆయన

బి. నాగిరెడ్డి - ఎం.జి.ఆర్.

భోజనానికి కూర్చునేవారు. నా భోజనం కాలేదని తెలిస్తే చాలు తను యింటినుంచి తెప్పించిన భోజనం నాతో పంచుకునేవారు. కనీసం పాతిక మందికి సరిపడే భోజనం తెప్పించేవారాయన. ఇలా పలుమార్లు ఆయనతో కలిసి భోజనం చేసాను.

ఆయన నటించే చిత్రాల్లో సమాజ శ్రేయస్సుకు పనికొచ్చే చక్కని సందేశాలుండేవి. సిగరెట్టు కాలుస్తున్నట్టుగానో, మద్యపానం సేవిస్తున్నట్టుగానో ఆయన ఏ చిత్రంలోనూ నటించేవారు కాదు. తన అభిమానులకి అది మంచి సంకేతంగా వుండదని భావించేవారాయన.

'ఎంగవీట్టు పిళ్ళై' (తమిళం) సినిమా తీయాలని నేను సంకల్పించిన తరుణంలో ఎం.జి.ఆర్. రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆయన్ని హీరోగా పెట్టి సినిమా తీయాలనుందని చెప్పినప్పుడు మిత్రులు వద్దని వారించారు.

"అలాకాదు. ఈ కథ, కథలోని ప్రధాన పాత్ర ఆయనకి చక్కగా సరిపోతుంది", అని పట్టు పట్టాను. "ఈ చిత్రం బాధ్యతని నా కొదిలిపెట్టండి. అంతా నేను చూసుకుంటాను", అన్నారు ఎం.జి.ఆర్. సరే అన్నాను. తన సొంత చిత్రంలాగా పూర్తి సహకారం అందించారు. ఆ చిత్ర నిర్మాణంలో అనుభవాలు నా మదిలో ఇంకా చెరిగిపోకుండా నిలిచి వున్నాయి.

వాహిని స్టూడియోలో 'ఎంగవీట్టు పిళ్ళై' షూటింగు ప్రారంభంకావడానికి ముందు రోజు విజయా గార్డెన్స్‌లో నేనూ, ప్రముఖ హిందీ నటుడు దిలీప్ కుమార్ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాము.

మామూలుగా షూటింగు జరిగే ఫ్లోరులో వేడిమి, ఉక్క తగ్గడం కోసం, సెట్లో ప్రతిధ్వని రాకుండా ఉండేందుకు, బయటి శబ్దాలు లోపలికి చొరబడకుండా వుండటానికి గోతాం సంచుల్లో కొబ్బరి పీచు నింపి పైకప్పుకింద, గోడల దగ్గర వేలాడదీస్తుంటాము.

ఫ్లోర్‌లో అంగడి వీధి సెట్ వేసుంది. మర్నాడు షూటింగు కోసం పక్క ఫ్లోర్‌లో జరిగే షూటింగులో పాల్గొనడానికి వచ్చిన ఒక జూనియరు ఆర్టిస్టు పొరపాటున కాల్చిపారేసిన సిగరెట్టు పీక వల్ల 'ఎంగవీట్టు పిళ్లై' సెట్‌లోని కొబ్బరి పీచు గోనె బస్తాలకి నిప్పంటుకుంది. క్షణాల్లో భగ భగమంటూ మంటలు పైకి లేచాయి. అప్పుడు ఎం.జి.ఆర్ హడావిడిగా విజయాగార్డెన్స్‌కి వచ్చారు.

"రెడ్డిగారూ! మనం వేసిన సెట్ కాలిపోతూ వుంది. రేపు షూటింగు. ఏం చెయ్యాలిప్పుడు?" అన్నారు ఆందోళన పడిపోతూ. "మరేం భయంలేదు స్టూడియో పనివాళ్ళున్నారు. మంటలార్పేస్తారు, నేనుగాని ఇప్పుడక్కడికి వచ్చానంటే నన్ను చూసి మరింత హడావుడి పడిపోగలరు. మీరు కంగారు పడకండి" అని చెప్పాను. కాని ఆయన ఊరుకోలేదు. వెంటనే స్టూడియోకి పరుగు తీశారు. మా అబ్బాయిలతో బాటు తనూ ఒకడిగా కలిసిపోయి మంటలార్పడానికి సాయపడ్డారు. అప్పట్నించి మా తమిళ సినిమా టైటిల్ 'ఎంగవీట్టు పిళ్లై' లాగే 'మా ఇంటి అబ్బాయి'గా అయినారు ఎం.జి.ఆర్.

తన వృత్తిని దైవంతో సమానంగా భావించినవారు ఎం.జి.ఆర్. 'ఎంగ వీట్టు పిళ్లై' నిర్మాణంలో వున్న సమయం. యం.జి.ఆర్, సరోజాదేవిల మీద మైసూరులో ఒక యుగళ గీతం చిత్రీకరించారు. ఆ పాట రష్‌ని వాహినిలో వేసి చూపించారు ఎం.జి.ఆర్.

"ఎలా వుంది?", అడిగారు పాట పూర్తయ్యాక.

"ఫరవాలేదు", అన్నాను ముక్తసరిగా.

"ఎందుకలా అంటున్నారు. పాట బాగా రాలేదా?", అనడిగారు డీలా పడిపోయి.

"పాటేమో బాగానే వుంది. కానీ ఒకచోట మాత్రం ఆ పాటలోని మాటలకి వేసుకున్న డ్రెస్సుకి పొంతన కుదరలేదనిపించింది", అన్నాను. ఆ తరువాత ఆయనేమీ మాట్లాడలేదు.

ఆ మర్నాడు.

అలవాటు ప్రకారం పొద్దునే వాకింగ్ బైలుదేరాను, స్టూడియో చుట్టూ ఒకసారి తిరిగి రావడానికి. ఒక ఫ్లోర్ దగ్గరికి రాగానే చటుక్కున ఆగిపోయాను. రాత్రంతా షూటింగు జరిగిన చిహ్నాలు కనిపించాయి. స్టూడియో పనివారిని పిలిచి అడిగాను.

రాత్రి ఎం.జి.ఆర్ ఆ ఫ్లోర్‌లో 'ఎంగవీట్టు పిళ్ళై' షూటింగు చేశారు అని తెలిసింది. నాకాశ్చర్యం వేసింది. రాత్రి ఎం.జి.ఆర్ ఇక్కడ షూటింగు చేశారా! నాతో ఒక్కమాట చెప్పలేదే? అప్పుడు ప్రొడక్షన్ మేనేజరు ద్వారా అసలు సంగతి తెలిసింది.

నేను రష్ చూసి పాటలోని, ఒక చరణానికి ఆ నటులు వేసుకున్న డ్రెస్ నప్పలేదని అన్నాను కదా! అది ఆయన మనసులో బాగా నాటుకుంది.

"రెడ్డిగారికి తృప్తి కలిగేవిధంగా ఆ పాటలోని చరణం మళ్ళీ చిత్రీకరించాలి", అని తీర్మానించుకుని ఆ చరణానికి సరిపడే దుస్తులు ధరించి రాత్రి ప్రారంభించి తెల్లవారు ఝామున ముగించేదాకా షూటింగు జరిపారని తెలిసింది.

**'రామ్ ఔర్ శ్యామ్' ప్రారంభోత్సవంలో చక్రపాణి, బి. నాగిరెడ్డి, ఎన్.టి.ఆర్., నాగిరెడ్డి గారి పెద్ద కుమారుడు ప్రసాద్, దిలీప్‌కుమార్, ఎమ్.జి.ఆర్., నాగిరెడ్డి గారి రెండవ కుమారుడు వేణుగోపాలరెడ్డి**

సినిమా విషయంలో ఇంతశ్రద్ధ తీసుకునే మనుషులుంటారా అని నాకాశ్చర్యం వేసింది. ఎందుకింత శ్రమ తీసుకున్నారని అడగడానికి ఆయన నివాస స్థలమైన రామావరం గార్డెన్సుకి ఫోను చేసాను. ఇంకా నిద్రలేవలేదని తెలిసింది.

ఆ తరువాత తిరిగి షూట్ చేసిన ఆ దృశ్యం వేసి చూపించి "చెప్పండి ఇప్పుడు తృప్తిగా వచ్చిందా?", అని నా భుజం తట్టారు. వృత్తిపట్ల ఆయనకున్న ఈ భక్తి శ్రద్ధలే ఆ రోజుల్లో ఆయన్ని సూపర్‌స్టార్‌ని చేశాయి.

అవి యం.జి.ఆర్ తమిళనాడు ముఖ్యమంత్రిగా వున్న రోజులు. నేను సుస్తీతో పడుకుని వున్నాను. ఎలాగో ఆ విషయం ఆయనకి తెలిసింది. అంతే! చెప్పాపెట్టకుండా బాడిగార్డ్సు, ఇతర పరివారంతో విజయా గార్డెన్సులోని మా యింటికి విచ్చేసారు. కారుని రికార్డింగు థియేటరు దగ్గరే ఆపేసి నడుచుకుంటూనే మా యింట్లోకి వచ్చారు.

"మీకు ఆరోగ్యం బాగాలేదని తెలిసి చూసిపోదామని వచ్చాను", అని ఎంతో ఆదరంతో పరామర్శించారు. "విదేశాల నుంచి మందులేమైనా అవసరమైతే చెప్పండి. తెప్పిస్తాను", అన్నారు.

"ఇప్పుడు నాకేం ఫరవాలేదు. కొంచెం విశ్రాంతి అవసరం. అంతే. మందులు మా ఆసుపత్రిలోనే వున్నాయి కదా", అన్నాను. సరే అన్నారు ఎం.జి.ఆర్.

నన్ను పరామర్శించాలంటే ఒక్క ఫోన్‌కాల్ చాలు. ఎన్నో అత్యవసర కార్యాలు వొదులుకుని ఒక ముఖ్యమంత్రి స్వయంగా నా దగ్గరకి వచ్చి పరామర్శించాల్సిన అవసరం లేదు. అయినా ఆయన వచ్చారంటే అది ఆయనలోని మహోన్నత సంస్కారాన్ని, మైత్రీ భావాన్ని సూచిస్తుంది.

బడిపిల్లల మధ్యాహ్న భోజన పథకం కమిటీలో నన్ను సభ్యుణ్ణి చేశారు ముఖ్యమంత్రి ఎం.జి.ఆర్. ఆ కమిటి సమావేశానికి నన్నాహ్వానించారు. వెళ్ళాను. సమావేశం ముగిశాక తన ముఖ్యమంత్రి హోదాని కూడా పట్టించుకోకుండా పూర్వంవలెనే స్నేహభావంతో నా భుజం మీద చేయి వేసి మాట్లాడుతూ వచ్చారు ఆయన!

1944లో మా తండ్రిగారికి జబ్బు చేసింది. మద్రాసు పురసవాక్కంలోని ఒక నర్సింగుహోములో చేర్చాము. రాత్రింబవళ్ళు ఆయన దగ్గరే వున్నాను. ఆ ఆసుపత్రిలోని అపరిశుభ్ర వాతావరణం చూసి చాలా బాధ వేసింది. ఒక మంచి ఆసుపత్రి

నిర్మించాలనే కోరిక అప్పుడే మొలకెత్తింది నాలో. భగవంతుని కృపతో కొన్నేళ్ళకి ఆ కోరిక నెరవేరింది. మా వాహిని స్టూడియో ప్రాంగణంలోనే విజయా హాస్పిటల్ నిర్మించాను.

ముఖ్యమంత్రిగా వున్న ఎం.జి.ఆర్. అనారోగ్య కారణంగా చికిత్స నిమిత్తం అమెరికా వెళ్ళారు. ఆయన తిరిగొచ్చాక నేను ఆయనింటికి వెళ్ళి కలిశాను. అప్పుడాయన నాతో ఇలా అన్నారు : "ఏదో మనమూ పుట్టాము, కొన్నాళ్ళు బతికాము, వెళ్ళిపోయాము అని కాకుండా మన పేరు ఎప్పటికి నిలిచి వుండేలా ఏదయినా మంచి పని చెయ్యాలి రెడ్డిగారూ! అమెరికాలో నాకు లభించిన చికిత్స – ఆ వసతులు అమోఘమైనవి. ముఖ్యమంత్రిగా వున్నాను గనక అంతటి ఖరీదైన చికిత్సని పొందగలిగాను. కాని సామాన్య ప్రజలకి అది సాధ్యమా? కాబట్టి మీరొక హెల్త్ సెంటర్ నిర్మించండి. అన్ని ఆసుపత్రుల మాదిరి కాకుండా అదొక ప్రత్యేకమైన హెల్త్ రిసార్ట్‌లాగుండాలి. ఎంత డబ్బు ఖర్చయినా సరే, నిస్సంకోచంగా అడగండి ఏర్పాటు చేస్తాను", అన్నారు.

"భగవంతుని దయవల్ల నాకు డబ్బుకేమీ లోటు లేదండి. మీ ఆశీర్వాదం వుంటే చాలు. త్వరలోనే విజయా హెల్త్ సెంటర్ నిర్మిస్తాను", అన్నాను. ఆయన ఎంతో సంతోషించారు.

అనుకున్నట్టే హెల్త్‌సెంటర్ నిర్మించగలిగాను. నేనిది వరకే నిర్మించిన చలన చిత్రాల హక్కులన్నీ విక్రయించగా వచ్చిన డబ్బుతో విజయా హాస్పిటల్, హెల్త్ సెంటర్, నన్నింతటి వాడిని చేసిన చెన్నై హాలీవుడ్ అనబడే వడపళనిలోనే ఏర్పాటయ్యాయి. హెల్త్ సెంటర్‌కు ఎవరి పేరు పెట్టాలా అని ఆలోచించాను. తనకి లభించిన ఉన్నత వైద్యసేవలు ప్రజలందరికి అందాలని అభిలషించిన ఎం.జి.ఆర్. పేరు పెడితే సమంజసంగా వుంటుందనిపించింది. ఈ విషయం ఆయనకు చెప్పాను. కాని ఆయన వద్దన్నారు. ఆయనలోని అణకువ అటువంటిది. మాపిల్లలంటే ఆయనకెంతో ప్రీతి. అంచేత పిన్నవయసులోనే మాకు దూరమైన మా పెద్ద అబ్బాయి ప్రసాద్ పేరుపెట్టమని సలహా యిచ్చారు.

'ప్రసాద్ మెమోరియల్' అనే పేరుతో కొత్తగా వెలిసిన మా విజయాహెల్త్ సెంటర్‌ని ఎం.జి.ఆర్. చేతుల మీదుగా తెరిపించాలని ఆశపడ్డాను. కాని నా కోరిక నెరవేరకముందే ఆయన పరమపదించారు.

'ప్రసాద్ మెమోరియల్' అని పెట్టమన్న ఎం.జి.ఆర్. పేరిట 'ఎం.జి.ఆర్. మెమోరియల్' వెలిసింది హెల్త్ సెంటర్‌లో. ఆయన కోరిక మేరకు హెల్త్ సెంటర్‌లోని

ఎమ్.జి.ఆర్.ని ఆహ్వానిస్తున్న బి. నాగిరెడ్డి



**విజయా హెల్త్ సెంటర్‌లో డా॥ ఎమ్.జి.ఆర్. మెమోరియల్**

వేరొక విభాగానికి 'ప్రసాద్ మెమోరియల్' అని పెట్టడం జరిగింది. ఈవిధంగా మా ఇరువురి కోరిక నెరవేరినందుకు నాకెంతో ఆనందం.

ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి, ఉల్లిపాయల వ్యాపారం చేసి, సొంతంగా ప్రింటింగు ప్రెస్సు ప్రారంభించి, అనతి కాలంలో భారతదేశంలోనే నెంబర్ వన్ ప్రెస్సుగా తీర్చిదిద్దగలిగాను. ఆలిండియా మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంటుగా వున్నాను.

ప్రింటింగు ప్రెస్సు, పత్రికా నిర్వహణ, చలనచిత్ర నిర్మాణం - ఈ మూడు రంగాలలోనూ చిత్తశుద్ధితో శ్రమించి సత్ఫలితాలను సాధించగలిగాను. రాష్ట్ర స్థాయిలోను, దేశీయ స్థాయిలోనూ ఎన్నో బిరుదులు, పురస్కారాలు నాకు లభించాయి.

ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షునిగా సైతం బాధ్యతలు నిర్వహించాను. లాల్ బహదూర్ శాస్త్రి, మొరార్జీ దేశాయ్, ఇందిరా గాంధి, రాజాజి, కామరాజ్, నీలం సంజీవరెడ్డి మొదలైన ప్రజానాయకులతో సన్నిహితంగా మెలిగి వున్నాను. వారంతా నన్ను 'నాగి' అని సంబోధించేటంత చనువుగా వుండేవారు నాతో. కీ.శే. ఎం.జి.ఆర్. మాత్రమే ప్రేమగా నన్ను 'రెడ్డి గారూ' అని పిలిచేవారు.

తిరుమల-తిరుపతి దేవస్థానం పాలక మండలికి అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు నిర్వహించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తాను.

మా అబ్బాయిలు పెరిగి పెద్దవారయ్యాక ప్రెస్సు, పత్రిక, స్టూడియో బాధ్యతలని వారి కప్పగించి నేను విజయా గార్డెన్సులో స్థిరపడ్డాను.

ప్రస్తుతం విజయా హాస్పిటల్, విజయా హెల్త్ సెంటర్ – ఈ రెండు 'విజయా ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ ట్రస్టు' ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయి.

మనలను దాటిపోయేది కాలం మాత్రమే కాదు; మన అనుభవాలు కూడా!

అనుభవాలకి అంతేది?...

**ఎన్నో వాగులు సెలయేళ్ళూ కలిస్తేనే**
**ఒక మహానది**
**ఎన్నో మణిపూసలు కూర్చినప్పుడే**
**ఒక హారం**
**నేను నిమిత్తమాత్రుడిని**
**ఈ విజయపథంలో నాతో చేతులు కలిపి**
**నడిచినవారూ**
**నన్ను నడిపించిన**
**ఎందరో మహానుభావులు**
**అందరికి నా వందనాలు.**

◆

# శ్రీ బి. నాగిరెడ్డి సంయుక్తంగా నిర్మాణం చేపట్టిన చిత్రాలు

తాయ్‌క్కు ప్పిన్ తారం - తమిళం (1956) - దేవర్ ఫిలింస్

నీలమలై త్తిరుడన్ - తమిళం (1957) - దేవర్ ఫిలింస్

సెంగోట్టై సింగం - తమిళం (1958) - దేవర్ ఫిలింస్



వాళవైత్త దైవం - తమిళం (1959) - దేవర్ ఫిలింస్

రేచుక్క - పగటి చుక్క(1959) - స్వస్తిశ్రీ పిక్చర్స్

భాగ్యజాతకం - మలయాళం (1962) - కేరళ పిక్చర్స్

లైలా మజ్ను - మలయాళం (1962) - కేరళ పిక్చర్స్ పతాకంపై



బదిలిక్కు బదిల్ - తమిళం (1974) బాలన్ కంబైన్స్

# ప్రముఖులతో బి. నాగిరెడ్డి....



నాటి రాష్ట్రపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ గారితో....



నాటి రాష్ట్రపతి డా॥ జాకీర్ హుస్సేన్ గారితో...

నాటి రాష్ట్రపతి శ్రీ జ్ఞాని జైల్‌సింగ్ గారితో....

నాటి రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి గారితో...



నాటి భారత ప్రధాని శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి గారితో...

నాటి భారత ప్రధాని శ్రీ మురార్జీ దేశాయ్ గారితో...

నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ గారితో...

నాటి తమిళనాడు
ముఖ్యమంత్రి
శ్రీ కామరాజ్ గారితో...



నాటి, నేటి తమిళనాడు ముఖ్యమంత్రి 'కలైంజ్ఞర్' కరుణానిధి గారితో...



నాటి తమిళనాడు ముఖ్యమంత్రి 'సెల్వి' జె. జయలలిత గారితో...

రాజ్‌కపూర్‌తో



డి.వి. నరసరాజు, బి.ఎన్. రెడ్డి, బి. నాగిరెడ్డి

శ్రీ ఎల్.వి. ప్రసాద్ గారితో...

నిర్మాత శ్రీ ఎ.వి. మెయ్యప్పన్ గారితో...

శ్రీ టి. అంజయ్య, తి.తి.దే. బోర్డు సభ్యులతో

శ్రీ సి.డి. దేశ్‌ముఖ్, శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్‌లతో

శ్రీ బెజవాడ గోపాలరెడ్డి గారితో



శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి గారితో



ఎన్.టి. రామారావు, దిలీప్ కుమార్‌లతో...



డి.వి.ఎస్. రాజు గారితో



శ్రీ శివాజీగణేశన్ గారితో...

శ్రీ అక్కినేని గారితో....



శ్రీ రజనీకాంత్ గారితో....



శ్రీ కమల్‌హాసన్ గారితో...

# అవార్డుల స్వీకారం...

నాటి రాష్ట్రపతి శ్రీ ఆర్. వెంకట్రామన్ గారి నుండి
'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డు (1987) స్వీకరిస్తూ...



తమిళనాడు ప్రభుత్వం ఇచ్చే
'కలైమామణి' అవార్డు
(1972)ను నాటి గవర్నర్
శ్రీ కె.కె. షా గారి నుండి
స్వీకరించారు

చెన్నైలో జరిగిన రెండవ ప్రపంచ తమిళ మహాసభలలో శ్రీ బి. నాగిరెడ్డిని సత్కరిస్తున్న నాటి ముఖ్యమంత్రి శ్రీ ఎన్. అన్నాదురై, చిత్రంలో ప్రస్తుత ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధి కూడా ఉన్నారు.

OTARY CLUB O ADI
ndin

రోటరీ క్లబ్ వారి 'ఫర్ ద సేక్ ఆఫ్ ఆనర్' అవార్డుని నాటి తమిళనాడు మంత్రివర్యులు శ్రీ ఆర్.ఎం. వీరప్పన్ నుండి స్వీకరిస్తూ...



శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి అధ్యక్షులుగా ఉన్నప్పుడు....

# బి. నాగిరెడ్డి అడుగుజాడలు

ఆంధ్ర రాష్ట్రం కడపజిల్లాలోని పొట్టిపాడు గ్రామంలో 01.12.1912లో జన్మించారు బి. నాగిరెడ్డి.

ఆనాటి కాంగ్రెసు నాయకులు కాశీనాథుని నాగేశ్వరరావు, టంగుటూరి ప్రకాశం పంతులుగార్ల ఆహ్వానం మీద విద్యార్థి దశలోనే స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారు.

తన పద్దెనిమిదవ యేటనే తమ కుటుంబ వర్తకం అయిన వాణిజ్య పంటల్ని బర్మా, శ్రీలంక, మలేసియా, సింగపూర్ మొదలైన దేశాలకి ఎగుమతి చేసే బాధ్యతను చేపట్టారు.

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో వ్యాపారంలో పెద్ద నష్టం యేర్పడింది. అప్పటికే మదరాసులో వున్న ప్రింటింగు బిజినెస్సుని పునఃప్రారంభించారు బి. నాగిరెడ్డి.

స్వాతంత్ర్య పోరాట కాలంలో రచయిత చక్రపాణి గారితో కలిసి సాహిత్య, సామాజిక, రాజకీయ చైతన్యంతో కూడిన 'ఆంధ్రజ్యోతి' మాస పత్రిక (1945)ను, బాలల కోసం 'చందమామ' మాస పత్రికను (1947) ప్రారంభించారు. అచిరకాలంలోనే 'చందమామ' పలు దేశభాషల్లో వెలువడే పత్రికగా రూపుదిద్దుకుంది. బహుశ దేశంలోనే పన్నెండు భాషలో ఒకేసారి వెలువడే పత్రిక 'చందమామ' ఒక్కటే.

తెలుగు చలనచిత్ర సీమలో విజయపతాకం ఎగురవేసిన తమ సోదరుడు బి.ఎన్. రెడ్డి మరియు కె.వి. రెడ్డి, కె. రాంనాథ్, ఎ.కె. శేఖర్, నటుడు వి. నాగయ్య, మూలా నారాయణస్వామి, బ్రిజ్ మోహన్‌దాస్ మొదలైన ప్రముఖులతో కలిసి 'వాహిని పిక్చర్స్' అనే చలనచిత్ర సంస్థని (1939) స్థాపించిన వారిలో ముఖ్యులు బి. నాగిరెడ్డి.

దక్షిణ భారతదేశ చలనచిత్ర పరిశ్రమకు వెన్నెముకగా నిలిచిన 'విజయా వాహిని' స్టూడియోని స్థాపించారు బి. నాగిరెడ్డి (1948). ఆగ్నేయాసియాలోనే అతి పెద్ద స్టూడియోగా ప్రసిద్ధి గాంచినది 'విజయా–వాహిని'. 1949లో 'విజయా ప్రొడక్షన్ సంస్థని ప్రారంభించి, తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం, హిందీ భాషలో 50కి పైగా చిత్రాలు నిర్మించారు. ఈ సినిమాలు చక్కని సందేశాన్నిచ్చే కుటుంబ చిత్రాలుగా పేరుపొందాయి. అన్ని తరగతుల ప్రేక్షకులని ఆనందపరిచేవి ఈ సినిమాలు.

దక్షిణ భారత చలనచిత్ర వాణిజ్య మండలి అధ్యక్షులుగా నాలుగుసార్లు, ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షునిగా రెండుసార్లు పదవీ బాధ్యతలు నిర్వహించారు నాగిరెడ్డి.

చలనచిత్ర రంగానికి ఎనలేని కృషి చేసినందుకుగాను భారత ప్రభుత్వం యిచ్చే విశిష్టమైన 'దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు'ని 1987లో అందుకున్నారు.

తమిళనాడు ప్రభుత్వం 1972లో 'కలైమామణి' బిరుదుతో సత్కరించింది.

'ఆలిండియా మాస్టర్ ప్రింటర్స్ ఫెడరేషన్' అధ్యక్షులుగా రెండుసార్లు ఎన్నికయ్యారు.

ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం 'రఘుపతి వెంకయ్య అవార్డు'తో గౌరవించింది. తిరుపతి వెంకటేశ్వరా యూనివర్సిటీ, అనంతపురం శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలు నాగిరెడ్డి గారిని గౌరవ డాక్టరేట్‌తో సత్కరించాయి.

ఎన్నో సంస్థలకి విరాళాలొసగిన వ్యక్తిగా ఖ్యాతిగాంచిన నాగిరెడ్డి వైద్య రంగంలో సైతం ఎంతో సాధించారు. చెన్నైలో ప్రపంచ స్థాయిలో చెప్పుకోదగిన 'విజయా హాస్పిటల్స్', 'విజయా హెల్త్ సెంటర్'లని స్థాపించారు. చికిత్స కోసం విదేశాల నుంచి కూడా వస్తూ వుంటారు ఈ ఆసుపత్రులకి.

తిరుమల-తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ విభాగంలో ముఖ్య సభ్యునిగా పలు సంవత్సరాలు సేవ చేసి తరువాత అధ్యక్ష బాధ్యత వహించాక నాగిరెడ్డి యాత్రికుల సౌకర్యార్థం ఎన్నో వసతులు కల్పించడంలో ఎంతో కృషి చేశారు.

ఒక సామాన్య వ్యవసాయదారునిగా జీవితం ప్రారంభించి సినిమా, పత్రిక, వైద్యరంగాలలో విశిష్టమైన కృషి సల్పి తనదంటూ చెరగని ముద్రను నిలుపుకున్న బి.నాగిరెడ్డి 25.02.2004లో కీర్తిశేషులైనారు.

◆

శ్రీ బి.నాగిరెడ్డి గారి జీవిత అనుభవాలను ఆయన మాటల్లోనే ఏర్చికూర్చిన వ్యాస సంకలనమే ఈ 'జ్ఞాపకాల పందిరి'!

తను పుట్టి పెరిగిన గ్రామం, తనకు సంప్రదాయ విలువలు నేర్పిన అక్కడి పెద్దల స్వభావాలు; స్వాతంత్ర్య స్ఫూర్తితో ఊరూరా తిరిగి అమ్మిన ఖద్దరు బట్టలు; చేసిన ఉల్లిపాయల వ్యాపారం, యువప్రాయంలోనే రంగూన్‌లో ఒక పేద కుటుంబానికి అందించిన సాయం; ప్రెస్సుతో పాటు స్థాపించి నిర్వహించిన పత్రికలు, నిర్మాతగా నిర్మించిన అపురూప చిత్రాలు; స్టూడియో అధినేతగా సాధించిన విజయాలు...

ఉదాత్త మైత్రికి ఆదర్శంగా నిలిచిన చక్రపాణి; అత్యంత ఆదరాభిమానాలు కనబరచిన ఎంజిఆర్, ఎన్‌టిఆర్; ఎదుటివారిలోని మంచినీ, శక్తిసామర్థ్యాలనూ అభినందించి ప్రోత్సహించిన ఎస్.ఎస్.వాసన్...

ఇలా పుస్తకం ఆద్యంతం మంచిని గురించీ, మంచి వారిని గురించీ ప్రస్తావించే జ్ఞాపకాల సుమాలు పాఠకుల హృదయాలలో మానవతా పరిమళాలు వెదజల్లుతాయి! ఉప్పొంగే ఉత్సాహాన్ని కలిగిస్తాయి!!

**విజయా పబ్లికేషన్స్**